జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 362 విశాఖపట్నం శుక్రవారం 16 సెప్టెంబరు 2022 8 పేజీలు వెల : 5.00

## ఐదురోజులు ఏపీ అసెంబ్లీ సమావేశాలు

17 అంశాలపై చర్చించేందుకు టీడీపీకి అనుమతి



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి:స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో సీఎం జగన్..మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్.. చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి, విప్ ప్రసాద్‌రాజులు పాల్గొన్నారు. టీడీపీ నుంచి అచ్చెన్నాయుడు బీఏసీ సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ ప్రస్తావించిన 17 అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది.ఐదురోజులు ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ఈ మధ్యకాలంలో కన్నుమూసిన సభ్యులకు ఏపీ అసెంబ్లీ సంతాపం తెలిపింది. మాజీ ఎమ్మెల్యే శత్రుచర్ల చంద్రశేఖరరాజు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పులపర్తి నారాయణమూర్తి, జేఆర్ పుష్పరాజ్, నల్లమిల్లి మూలారెడ్డి మృతి పట్ల సభ్యులు సంతాపం ప్రకటించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు.

### అమరావతి రాజధాని రైతులతో ...
# కృత్రిమ ఉద్యమం
## అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్

అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతి రాజధాని రైతులతో వెయ్యిరోజులుగా కృత్రిమ ఉద్యమాన్ని నడిపిస్తున్నారని ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. వివిధ అంశాలపై చర్చ జరిగిన తరువాత చివరగా పరిపాలన వికేంద్రీకరణపై జగన్ మాట్లాడారు. కట్టని రాజధాని గురించి, కట్టలేని గ్రాఫిక్స్ గురించి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టిస్తున్నారని విరుచుకుపడ్డారు. మరోసారి అమరావతి రైతులతో మహాపాదయాత్ర నిర్వహిస్తూ మిగతా ప్రాంతాల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తూ, రెచ్చగొడుతూ డ్రామా నడుపుతున్నారని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ , పేద



ఓసీల కోసం ఉద్యమం చేస్తున్నారా? లేదని అన్నారు. టీడీపీ నాయకులు పెత్తందారి మనస్థత్వంతో పాలన కొనసాగించారని దుయ్యబట్టారు. తమ బినామీ భూములున్న ప్రాంతమే రాజధాని కావాలని అనుకున్నారని, అమరావతి ప్రాంత ప్రజలపై తనకు ఎలాంటి కోపాలు లేవని పేర్కొన్నారు. మాయమాటలతో మోసం చేస్తున్న చంద్ర బాబు 420 కేసు పెట్టాలని అన్నారు.

**'దేనికైనా రెడీ'.. మీ నాయకుడిని రమ్మనండి..**

సీఎం జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్ 15వ తేదీ గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాలు పూర్తయిన తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం పార్టీతో పాటు.. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపుతున్నాయి. ఈసమావేశానికి తెలుగు దేశం పార్టీ తరపున అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ప్రజా సభస్యలను చర్చించాల్సిన సభలో అనవసరంగా గందరగోళం సృష్టించడం ఏంటని అచ్చెన్నాయుడు తో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష టీడీపీ ఏం అంశాన్ని లేవనెత్తినా సభలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని.. మీ నాయకుడిని సభకు రమ్మనండి దేనికైనా రెడీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు జగన్. ప్రజా సమస్యలపై చర్చించడానికి తాము ఎప్పుడూ సిద్ధమేనని సీఎం స్పష్టం చేశారు. మీరు ఒకటి అంటే మా వాళ్ళు పది మాటలు అనగలరని ఈసందర్భంగా జగన్ వ్యాఖ్యానించారు. **(మిగతా 2లో..)**

## అక్టోబరు 5 నుంచి పవన్ బస్సు యాత్ర-భిన్నంగా తయారీ



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి:బనస్సయాత్రని ప్రారంభించనున్నారు పవర్ స్టార్ ..జనసేన అధినేత పవన్ కల్యాణ్ . ఈ యాత్ర కోసం పవన్ కల్యాణ్ వినియోగించే బస్సును ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ బస్సు పనులు చకచకా సాగుతున్నాయి. సెప్టెంబరు 26 నాటికి బస్సు పనులు పూర్తవుతాయని తెలుస్తోంది. ఓ వర్క్ షాపులో ఈ బస్సు పనులు జరుగుతున్నాయి. లోపలి భాగంలోనూ పవన్ బస చేసేందుకు అనేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. దూరంగా ఉన్నవారికి సైతం పవన్ కనిపించేలా ఈ బస్సు టాప్ ను తీర్చిదిద్దుతున్నారు. సౌండ్ సిస్టమ్ ను సైతం ఈ బస్సుకే అటాచ్ చేయనున్నారు. ఇప్పటివరకు వివిధ నేతలు రాజకీయ యాత్రలకు ఉపయోగించిన బస్సులతో పోల్చితే ఇది భిన్నంగా కనిపిస్తుంది. నాడు ఎన్టీఆర్ వినియోగించిన చైతన్యరథానికి ఇది దగ్గరగా ఉంది. పవన్ బస్సుకు రెగ్యులర్ సైజు టైర్లు అమర్చారు.

## ఏపీ అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యుల సస్పెన్షన్



అమరావతి,ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ శాసన సభ సమావేశాలను అడ్డుకుంటున్నారని ఆరోపణతో టీడీపీ ఎమ్మెల్యేలను స్పీకర్ ఒకరోజు పాటు సస్పెన్షన్‌కు గురి చేశారు. కీలకమైన అంశాలపై చర్చ జరుగుతుండగా ఇతర అంశాలను లేవనెత్తడంతో పాటు తమకు చర్చకు అవకాశం ఇవ్వాలని పోడియం వద్దకు దూసుకొచ్చిన దేశం ఎమ్మెల్యేల ను ఒకరోజు పాటు సస్పెన్షన్ చేయాలని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ మాట్లాడుతూ వారిని ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు ప్రకటించారు.సస్పెన్షన్‌కు గురైన వారిలో ఎమ్మెల్యేలు అశోక్, కింజవరపు అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, వెంకట్‌రెడ్డి, జోగేశ్వర్‌రావు, పయ్యావుల కేశవ్, గద్దె రామ్మోహన్ రావు, వెలగపుడి రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్, బాలవీరాంజనేయ స్వామి ఉన్నారు. అంతకు ముందు దాదాపు రెండు గంటల పాటు వికేంద్రీకరణ అంశం, మూడు రాజధానులు తదితర అంశాలపై సుధీర్ఘ చర్చ జరిగింది .

## ఏపీ అటవీశాఖలో భారీగా అధికారుల బదిలీ




అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి:ఆంధ్రప్రదేశ్‌లో 14 మంది అటవీశాఖ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో డీఎఫ్‌వోలు, సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారులు ఉన్నారు. ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్?గా ఐఎఫ్ఎస్ అధికారి విగ్నేశ్ ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి లోని శ్రీవెంకటేశ్వరా జులాజికల్ పార్కు క్యూరేటర్?గా సి.సెల్వాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. రంప చోడవరం, శ్రీకాకుళం, అన్నమయ్య, ఏలూరు, వేర్వేరు ప్రాంతాల్లోని అటవీ సంరక్షణాధికారులుగా మిగతా 12 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు.



## కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌కు ఈడీ నోటీసులు..!

బెంగళూరుప్రజాపాలన ప్రతినిధి: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, విచారణకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. అయితే తన రాజ్యాంగ, రాజకీయ బాధ్యతలను నిర్వర్తించేందుకు సమయం అడ్డు వస్తోందని ట్వీట్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలతో పాటు మరికొద్ది రోజుల్లో కర్నాటకలో అడుగుపెట్టనున్న పార్టీ 'భారత్ జోడో యాత్ర' మధ్య నోటీసులు వచ్చాయని పేర్కొన్నారు. ఈడీ కావాలనే నోటీసులు జారీ చేసిందని ఆరోపించారు.

## వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా కల్పిస్తాం: నితీశ్ కుమార్



పాట్నా: 2024 ఎన్నికల తర్వాత ఒకవేళ బీజేపీయేతర పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, అప్పుడు వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా కల్పించనున్నట్లు బీహార్ సీఎం నితీశ్ కుమార్ తెలిపారు. ఒక్క బీహార్‌కు మాత్రమే కాదు, అన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన నితీశ్ అక్కడ విపక్ష నేతల్ని కలుసుకున్న విషయం తెలిసిందే.ఒకవేళ ఏదైన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తే, అప్పుడు కేంద్ర పథకాలకు 90:10 శాతంతో నిధులను కేటాయించడం జరుగుతుంది. ఇది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రత్యేక హెూదా ఉన్న రాష్ట్రాలకు దీని ద్వారా లాభం జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 11 రాష్ట్రాలకు ప్రత్యేక హెూదా ఉంది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు స్పెషల్ స్టేటస్ ఉంది.నేషనల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆయా రాష్ట్రాలకు ఆ హెూదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదనలను ఆమోదించిన తర్వాత ప్రత్యేక హెూదా సిద్ధాంతాన్ని ప్రభుత్వం పక్కనపెట్టింది.

## రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్‌కు దక్కిన జాతీయ అవార్డులు



విశాఖపట్నం: గుజరాత్‌లోని సూరత్‌లో జాతీయ హిందీ దినోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ వేడుకల సందర్భంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) కి రెండు జాతీయ అవార్డులు దక్కాయి. అలాగే, కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ అధికార భాషా విభాగం ద్వారా దేశంలోనే అత్యుత్తమ రాజభాషా కీర్తి పురస్కారం లభించింది. హిందీని విజయవంతంగా అమలు చేసినందుకుగానూ ఆర్ఐఎన్ఎల్ వరుసగా నాలుగో సారి రాజభాషా కీర్తి పురస్కారాన్ని అందుకున్నది. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఇతర ప్రముఖుల సమక్షంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నుంచి ఆర్ఐఎన్ఎల్ సీఎండీ అతుల్ భట్ ఈ అవార్డును అందుకున్నారు. హిందీ ఇన్-హౌస్ మ్యాగజైన్ విభాగంలో ఆర్ఐఎన్ఎల్ మ్యాగజైన్ 'సుగంధ్' మళ్లీ ఉత్తమ మ్యాగజైన్‌గా ఎంపికైంది. అధికార భాషపై పార్లమెంటరీ కమిటీ వైస్-ఛైర్మెన్ భర్తృహరి మహతాబ్ నుంచి 'సుగంధ్' ఎడిటర్, జనరల్ మేనేజర్ లలన్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. టౌన్ అధికారిక భాషా అమలు కమిటీ కూడా 'సీ' విభాగంలో రెండో బహుమతిని పొందింది. ఈ సందర్భంగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నుంచి టీఓఎల్ఐసీ సభ్య కార్యదర్శి లలన్ కుమార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ టీమ్‌ను చైర్మన్ అతుల్‌భట్ అభినందించారు. ఈ అవార్డులను సంస్థతోపాటు సంస్థలోని ఉద్యోగులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.



# ఆగని రాజధాని రగడ

విజయవాడ, సెప్టెంబర్ 15, :రాష్ట్రంలోనైనా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఏవైనా విధానపరమైన అంశాలపై, లేదా అవినీతి, అక్రమాలపై, పథకాల అమలు తీరుపై ఇంకా ఇతర అంశాల్లో విమర్శల పర్వం నడుస్తోంది. ఎక్కడా కూడా రాజధాని విషయంలో మాత్రం రచ్చ జరగదు. ఎందుకంటే కొత్తగా రాజధానులు ఏర్పాటు చేసుకున్న రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పరిస్తితులు లేవు. పైనున్న అన్నీ రచ్చలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని గురించి కూడా మూడేళ్లుగా రచ్చ నడుస్తోంది.అటు అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ?ఈ రాజధాని అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ ముందుకెళుతున్నాయి. రాష్ట్రం విడిపోయాక అప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు..ఏకవక్షంగా అమరావతిని రాజధానిగా ప్రకటించేశారు?ఏదో మొక్కుబడిగా అప్పుడు జగన్ మద్ధతు ఇచ్చారు. ఇక చంద్రబాబు ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేదు. గ్రాఫిక్స్‌లు చేసి జనాలని మురిపించారు. ఇక అక్కడ టీడీపీ లెక్కలేనంత అవినీతి, అక్రమాలకు



పాల్పడిందని వైసీపీ ఆరోపిస్తూ? అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల కాన్సెప్ట్ తీసుకొచ్చింది. అమరావతికి ముంపు ఉందని, ఖర్చు ఎక్కువని, అదే అన్నీ రెడీగా ఉన్న విశాఖ అయితే రాజధానిగా బాగుంటుందని జగన్.. ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించారు. అయితే మూడు రాజధానులు చెప్పి మూడేళ్లు అయింది?కానీ ఇంతవరకు దారి దిక్కు లేదు. పైగా మూడు రాజధానులకు వ్యతిరేకంగా కేసులు పడటంతో మూడు రాజధానుల బిల్లుని ఉపసంహరించుకున్నారు. మళ్ళీ కొత్త బిల్లుతో వస్తామని చెప్పారు. ఎలాగైనా మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని వైసీపీ చెబుతోంది.ఇటు ఏమో టీడీపీ ఒకే రాజధాని ఉంటుందని, అది అమరావతి అంటుంది?అటు అమరావతి రైతులు మళ్ళీ పోరాటం మొదలుపెట్టారు. అమరావతి నుంచి శ్రీకాకుళంలోని అరసవల్లి వరకు పాదయాత్ర ప్లాన్ చేశారు..కానీ దీనికి డీజీపీ పర్మిషన్ ఇవ్వలేదు. దీంతో రైతులు కోర్టుకు వెళ్లారు. ఇలా రాజధాని విషయంలో ఎప్పుడు ఏదొక రగడ నడుస్తూనే ఉంది.దీని వల్ల రాజకీయ పార్టీలకు రాజకీయ లబ్ది వస్తుందేమో గానిచివరికి నష్టపోయేది మాత్రం ప్రజలే. ఇప్పటికే బయట రాష్ట్రం వాళ్ళు..మీ రాజధాని ఏది అంటే ఏపీ ప్రజలు సమాధానం చెప్పలేని పరిస్తితిలో ఉన్నారు. అలాంటి పరిస్తితుల్లో ఏపీ ఉంది.

ఒకటి వర్సెస్ మూడు

ఏపీలో రాజధాని విషయంలో రాజకీయం నడుస్తూనే ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాజధాని అంశం సందిగ్ధంలో పడిపోయిన విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలోకి రాగానే మూడు రాజధానులు ప్రకటన చేసింది?అమరావతిని శాసన రాజధానిగా ఉంచేసి.. విశాఖపట్నంని పరిపాలన రాజధానిగా, కర్నూలుని న్యాయ రాజధానిగా చేస్తామని జగన్ అసెంబ్లీలో ప్రకటించారు.కానీ ప్రతిపక్ష టీడీపీ మాత్రం ఒకే రాజధాని అది అమరావతి అనే నినాదం అందుకుంది. అలాగే అమరావతి ప్రాంతానికి చెందిన రైతులు, ప్రజలు.. అమరావతి కోసం ఉద్యమం మొదలుపెట్టారు. ఇక అలా అలా ఈ రాజధాని అంశం మూడేళ్ళ వరకు సాగింది. ఇప్పటికీ రాజధాని విషయంలో రచ్చ నడుస్తూనే ఉంది. అటు మూడు రాజధానులు అమలు అవ్వలేదు. ఇటు అమరావతి రాజధానిగా ఉందని ప్రకటించడం లేదు. కానీ అమరావతి రైతులు మాత్రం తమ ఉద్యమాన్ని ఆపడం లేదు. తాజాగా అమరావతి టూ అరసవెల్లి పాదయాత్ర మొదలు పెట్టారు. ఉత్తరాంధ్ర మీదుగా ఈ పాదయాత్ర జరగనుంది. అయితే ఉత్తరాంధ్రలో పాదయాత్ర జరగనివ్వమని వైసీపీ మంత్రులు ప్రకటన చేస్తున్నారు. అలాగే జేఏసిలు పేరిట వైసీపీ నేతలు సమావేశాలు ఏర్పాటు చేసి.. అమరావతి రైతుల పాదయాత్రని అడ్డుకుంటామని పిలుపునిస్తున్నారు. ఇలా మూడు రాజధానులు అని వైసీపీ, ఒకటే రాజధాని అని టీడీపీ రాజకీయం నడిపిస్తున్నాయి. ఈ రాజధాని అంశాన్ని భుజాన వేసుకుని ఎవరికి వారు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారు. మూడు రాజధానుల ద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రాజకీయంగా లబ్ది పొందాలని వైసీపీ..అమరావతి ద్వారా కోస్తాలో బెనిఫిట్ పొందాలని టీడీపీ చూస్తున్నాయి.అయితే ఇప్పుడు అమరావతి రైతుల పాదయాత్ర..ఉత్తరాంధ్ర మీదుగా జరగనుంది. దీంతో అక్కడ అమరావతికి మద్ధతు వస్తే వైసీపీకి ఇబ్బంది. అందుకే అక్కడ అమరావతికి మద్ధతు దక్కకుండా చేయాలని వైసీపీ చూస్తుంది. అందుకే ఎలాగైనా పాదయాత్ర అడ్డుకుంటామని వైసీపీ అంటుంది. మరి ఉత్తరాంధ్రలోకి పాదయాత్ర వెళితే ఎలాంటి రచ్చ జరుగుతుందో చూడాలి.

# తిరుమలకు గేర్ లేని బండి

తిరుమల సెప్టెంబర్ 15,:కలియుగ వైకుంఠం అంటేనే అదో అనుభూతి.. తిరుమల బ్రహ్మోత్సవాల గురించి ఎంత చెప్పినా తక్కువే. లక్షలాదిమంది భక్తులు ఆమలయప్పస్వామిని కనులారా వీక్షించి తరిస్తారు. నమో వేంకటేశాయ అనే మంత్రం విని పులకాంకితులు అవుతారు. త్వరలో తిరుమల బ్రహోత్సవ శోభతో అలరారనుంది. ఈ నేపథ్యంలో అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్ ఒకటి తిరుమలకు రానుంది.రైల్ రన్ కోసం ప్రస్తుతానికి అలిపిరి డిపోకు వచ్చింది ఏసీ విద్యుత్తు బస్సు. దీనిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఇందులో గేరు వ్యవస్థ ఉండదు. డ్రైవర్ సీటు వద్ద బ్రేకు, ఎక్స్ లేటర్ మాత్రమే ఉంటాయి. వైఫైతో పాటు డిస్ ప్లే స్క్రీన్, వాకీ టాకీ, ముందు వెనుక సీసీ కెమెరాలు ఉన్నాయి. ఛార్జింగ్ పోర్టుకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.ఈ ఎలక్ట్రిక్ బస్సుకి పూర్తిగా అద్దాలు మూసి ఉండటంతో ప్రతి విండో వద్ద అత్యవసర ఏర్పాట్లు చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఈ బస్ ని ఆసక్తిగా తిలకించారు. డిపోలో ఛార్జింగ్ పాయింట్ వ్యవస్థ నిర్మాణంలో ఉంది. ఇప్పటికే ఛార్జింగ్ పాయింట్ బాక్సులు డిపోకు చేరుకున్నాయి. ఒక్కసారి ఛార్జింగ్ పెడితే సుమారు 240 కిలోమీటర్లు వరకు ఛార్జింగ్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 21న ప్రారంభం చేయనున్నట్లు అలిపిరి



డిపో మేనేజర్ హారిబాబు తెలిపారు.మరోవైపు తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు అధికారులు. గరుడ సేవకు 6 లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు టీటీడీ అధికారులు. బ్రహ్మోత్సవాలకు 7 వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల భద్రతపై త్వరలోనే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించే అవకాశం వుందని తెలుస్తోంది. ఇప్పటికే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇఓ ధర్మారెడ్డితో సమావేశం నిర్వహించారు ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి.

# మళ్లీ కేబినెట్‌లోకి కొడాలి నాని..?

విజయవాడ, సెప్టెంబర్ 15, :జగన్ కేబినెట్‌ని ముచ్చటగా మూడో సారి మార్చేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి.. తన ప్రయత్నాలను ముమ్మరం చేశారనే ఓ చర్చ తాడేపల్లి ప్యాలెస్ సాక్షిగా వైసీపీలో జోరుగా సాగుతోంది. మరోసార జగన్ కేబినెట్ పునర్వ్యవస్థీకరించేందుకు నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టే అవగతమౌతున్నది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా తన తొలి కేబినెట్‌లోని కొడాలి నాని, పేర్ని నాని, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్, కురసాల కన్నబాబులతకు స్థానం కల్పించే విషయాన్ని జగన్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దసరా తరువాత జగన్ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న స్పష్టమైన సందేశం ఇప్పటికే మంత్రులకు చేరినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే పైన పేర్కొన్న వారిలో అందరికీ కేబినెట్ లో చోటు దక్కుతుందా, లేదా కొందరికి మాత్రమే జగన్ అవకాశం ఇస్తారా అన్న విషయంలో మాత్రం స్పష్టత రాలేదు. అయితే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి మాత్రం మంత్రి పదవి పక్కా అని పార్టీ వర్గాలు



గట్టిగా నమ్ముతున్నాయి. అంతే కాకుండా ఈ సారి కొడాలి నానికి కేబినెట్ లో అత్యంత కీలక శాఖను కట్టబెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంటున్నారు. క్విడ్ ప్రోకో తరహాలో నీకు ఇది.. నాకు ఇది అనే తరహాలో సీఎం జగన్, కొడాలి నాని మధ్య.. ఓ ఒప్పందం కుదిరిందని కూడా పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అదేమిటంటే విపక్షంపై బూతుల వర్షంతో విమర్శలు గుప్పించడం కొడాలి నాని వంతు అయితే మంత్రివర్గంలో కీలక పదవి కట్టబెట్టడం జగన్ వంతు అన్నదే ఆ ఒప్పందంగా పరిశీలకులు విశ్లేషణలు చేస్తున్నారు. ఆ ఒప్పందంలో ఇటీవల కొడాలి నాని ప్రెస్ మీట్ పెట్టి.. చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబంపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొడాలి నాని వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా నిప్పులు చెరిగారు. అంతేకాదు.. కొడాలి నాని వ్యాఖ్యలకు నిరసనగా పలు ఆందోళనలు, ధర్నాలు సైతం చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు జగన్ తన రెండో సారి కేబినెట్ విస్తరణలో భాగంగా 11 మంది పాతవారిని కొనసాగిస్తూనే.. కొత్తగా మరో 14 మందికి చోటు కల్పించిన సంగతి తెలిసిందే. అయితే పాత వారంతా.. కొత్త వారు వచ్చారు కదా.. వాళ్లు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడుతారులే అంటూ సైలెన్స్ మెయింటైన్ చేస్తున్నారట. కానీ కొత్త వారు మాత్రం.. కొత్తగా మంత్రి పదవులు దక్కేసరికి... గుళ్లులు, గోపురాలు, తాడేపల్లి ప్యాలెస్‌ల.. చుట్టు ప్రదక్షణాలు చేయడంతో ఆ నాలుగు నెలల కాలం కాస్తా.. గాలిలో పెట్టిన పచ్చ కర్పురం కరిగిపోయినట్లు కరిగిపోయింది.ఈ నేపథ్యంలోనే తన తాజా కేబినెట్ పని తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న జగన్ కొత్త మంత్రుల ముఖం మీదనే వారిని కడిగి పారేసి మంత్రి పదవులు ఊడబీకేస్తానని హెచ్చరించినట్లు చెబుతున్నారు. అసలు దీనికంతటికీ కారణం ఢిల్లీ లిక్కర్ కుంభకోణం వ్యవహారంలో తన సతీమణి భారతిపై విపక్ష నేతల విమర్శలకు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఎవరూ స్పందించకపోవడం, విపక్ష నేతల విమర్శలను తిప్పికొట్టకపోవడమే కారణంగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ప్రతిపక్ష టీడీపీ నేతలు... తనను కానీ పార్టీని కానీ కార్నర్ చేస్తే.. గత కేబినెట్‌లోని పలువురు మంత్రులు.. ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడిన వీడియోలు సైతం.. మన పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్నాయని.. వాటిని చూసి అయినా నేర్చుకోవాలంటూ మంత్రువర్గానికి హితబోధ చేశారని కూడా పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గట్టిగా విపక్షాలపై విమర్శలతో విరుచుకు పడగలిగే, బూతులు మాట్లాడేందుకు కూడా వెనుకాడని కొడాలి నానిని మరోసారి తన కేబినెట్ లోకి తీసుకోవాలన్న నిర్ణయానికి జగన్ వచ్చేశారు. ఈ పరిణామంపై ప్రజాస్వామ్య వాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎవరినైనా కేబినెట్ లోకి తీసుకోవాలంటే వారి నీతి, నిజాయతీ, సమాజ సేవ, సచ్ఛీలత వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకునే వారనీ, అయితే నేడు పరిస్థితి పూర్తి భిన్నంగా మారిందని అంటున్నారు. గుండాయిజం, రౌడీయిజం మంత్రి పదవికి ఒక అర్హతగా, ప్రత్యర్థులను దుర్భాషలాడటం అదనపు అర్హతగా మారిపోయినట్లుగా పరిస్థితి తయారైందని ప్రజాస్వామిక వాదులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మనం డెమోక్రసీలో ఉన్నామా? లేక డెమినోక్రసీలో ఉన్నామా? అన్న అనుమానం కలుగుతోందని పరిశీలకులు అంటున్నారు.

## అమరావతి రాజధాని రైతులతో ...కృత్రిమ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

సభ సజావుగా జరిగేలా ప్రతిపక్ష సభ్యులు సహకరించాలి, సభకు వచ్చి గౌరవంగా ఉండాలని సీఎం జగన్మోహన్ రెడ్డి టీడీపీ సభ్యులకు సూచించారు. ప్రతిపక్ష సభ్యులు ఉన్నది 17మంది మాత్రమే అని.. తాము 150 మంది ఉన్నామని ఈసందర్భంగా సీఎం గుర్తు చేశారు. మీరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే తమ సభ్యులు కూడా అదే చేస్తారని చెప్పారు. మీ నాయకుడిని సభకు రమన్నండి%ా%. మాట్లాడదాం అని సీఎం జగన్ సూచించారు. ఇదే సందర్భంలో బీఏసీలో అధికార, ప్రతిపక్ష నాయకుల కుటుంబ సభ్యుల మీద వ్యక్తిగత ఆరోపణలపై కూడా చర్చ జరిగింది. ముఖ్యమంత్రిని జగన్ అంటూ మర్యాద లేకుండా సంభోదిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి ప్రస్తావించగా.. ఈవివాదం ప్రారంభమైందే వల్లభనేని వంశీ వల్ల అంటూ అచ్చెన్నాయుడు కౌంటర్ ఇచ్చారు. టీడీపీ నాయకులు కూడా ఇష్టానుసారం మాట్లాడుతున్నారని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మొత్తంమీద బీఏసీ సమావేశంలో సీఎం జగన్ టీడీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. కాగా అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులపాటు నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయించారు.

## రోజర్ ఫెదరర్ టెన్నిస్‌కు వీడ్కోలు

న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి: టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ సంచలన ప్రకటన చేశాడు. ప్రొఫెషనల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించాడు. ఈ నెల 23 నుంచి లండన్‌లో జరగనున్న లావెర్ కప్ తర్వాత టెన్నిస్‌కు గుడ్‌బై చెబుతున్నట్టు పేర్కొన్నాడు. 20 గ్రాండ్ స్లామ్‌లు సొంతం చేసుకున్న ఫెదరర్ దిగ్గజ టెన్నిస్ క్రీడాకారుల్లో ఒకడిగా పేరు సంపాదించుకున్నాడు. టెన్నిస్‌తో తన అనుబంధం కొనసాగుతుందన్న ఫెదరర్.. ఈ నెల 23న ప్రారంభం కానున్న లావెర్ కప్ తనకు చివరి టూర్ అని పేర్కొన్నాడు. 20 గ్రాండ్‌స్లామ్‌లలో ఆరు ఆస్ట్రేలియన్ ఓపెన్, 8 వింబుల్డన్, 5 యూఎస్ ఓపెన్, ఒక ఫ్రెంచ్ ఓపెన్ ఉన్నాయి.వింబుల్డన్ 2021 క్వార్టర్ ఫైనల్‌లో కనిపించిన తర్వాత ఏ టూర్‌లోనూ ఆడనప్పటికీ పునరాగమనాన్ని మాత్రం కొట్టిపడేయలేదు. అయితే, ఈ స్విస్ దిగ్గజం ఇటీవల తరచూ మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. ఈ విషయంలో తన శరీరం తనకు స్పష్టమైన సందేశం పంపిందని, అందుకే ఈ ప్రకటన అని పేర్కొన్నాడు. గత మూడేళ్లలో గాయాలు, సర్జరీలతో పలు సవాళ్లు ఎదుర్కొన్న విషయం మీలో చాలామందికి తెలుసన్న ఫెదరర్.. పూర్తిస్థాయిలో ఫామ్ సంతరించుకుని పునరాగమనం కోసం చాలా ప్రయత్నాలు చేశానన్నాడు.

## వైసీపీలో స్ట్రాంగ్ అవుతున్న సజ్జల అండ్ కో




గుంటూరు, సెప్టెంబర్ 15, :ఏపీ రాజకీయాల్లో వైసీపీ సోషల్ మీడియా అంత స్ట్రాంగ్‌గా మరొక పార్టీ సోషల్ మీడియా విభాగం లేదని చెప్పొచ్చు. ఇంకా చెప్పాలంటే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడానికి గల ప్రధాన కారణాల్లో వైసీపీ సోషల్ మీడియా విభాగం ఒకటి. సోషల్ మీడియా పని ఒకటే?ప్రత్యర్ధులని ఆరోపణలని తిప్పికొట్టడం అలాగే ప్రత్యర్ధులని ఇరుకున పెట్టేలా ఆరోపణలని ప్రచారం చేయడం.అయితే అధికారంలోకి వచ్చాక కూడా వైసీపీ సోషల్ మీడియా ఎక్కడా తగ్గడం లేదు..తీవ్ర స్థాయిలోనే టీడీపీకి, జనసేనకు కౌంటర్లు ఇస్తుంది. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ఏ స్థాయిలో ప్రత్యర్ధులని తిడతారో చెప్పాల్సిన పని లేదు. ఇలా స్ట్రాంగ్ గా ఉండే వైసీపీ సోషల్ మీడియాకు టీడీపీ సోషల్ మీడియా గట్టి పోటీ ఇస్తుంది. అదే సమయంలో జనసేన సోషల్ మీడియా సైతం వైసీపీనే టార్గెట్ చేస్తుంది. అలాగే బీజేపీ కూడా అదే పనిలో ఉంది. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల సోషల్ మీడియా విభాగాలు జగన్‌ని గట్టిగా టార్గెట్ చేస్తున్నాయి. అదే సమయంలో న్యూట్రల్ విభాగాల నుంచి కూడా జగన్‌పై విమర్శలు వస్తున్నాయి.ఈ క్రమంలో వైసీపీ సోషల్ మీడియా విభాగాన్ని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా జగన్ సూపర్ స్ట్రాటజీతో ముందుకొచ్చారు. సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడు సజ్జల భార్గవరెడ్డికి సోషల్ మీడియా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు వైసీపీ సోషల్ మీడియా విభాగాలు అన్నీ విజయసాయి రెడ్డి ఆధ్వర్యంలో నడిచేవి.సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాల దాడి, ఆరోపణలు పెరుగుతుండడంతో కౌంటర్ స్ట్రాటజీ టీమ్ అవసరమని భావించి తాజాగా సోషల్ మీడియా వింగ్ కార్యకర్తలతో భేటీ అయిన జగన్?.సోషల్ మీడియా విభాగం బాధ్యతలని సజ్జల తనయుడుకు అప్పగించాలని డిసైడ్ అయ్యారని తెలిసింది. ఇక ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా పనిచేయనుంది.

## ఆపరేషన్ సమస్యలతో గుంటూరు మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు

గుంటూరు: ఆపరేషనల్ సమస్యల కారణంగా గుంటూరు మీదుగా నడిచే పలు రైళ్లను ఇవాళ నుంచి రద్దు చేస్తున్నట్లు డివిజనల్ రైల్వే తెలిపింది. ఈ రైళ్ల రద్దు ఈ నెల 20వ తేదీ వరకు ఉంటుందని వెల్లడించింది. విజయవాడ- కొండపల్లి మధ్య మూడో రైలు మార్గం నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. దాంతో కొన్ని గూడ్స్ రైళ్లను మోటుమర్రి-విష్ణుపురం మీదగా నడికుడి మార్గంలో మళ్లిస్తున్నారు. ఫలితంగా 6 రోజుల పాటు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.విజయవాడ-గుంటూరు (రైలు నంబర్లు 07783, 07628, 07464), గుంటూరు-తెనాలి (నంబర్ 07887), గుంటూరు-రేపల్లె (రైలు నంబర్ 077 86), రేపల్లె-తెనాలి (రైలు నంబర్ 07873), తెనాలి-గుంటూరు (నంబర్ 07282), గుంటూరు-విజయవాడ (రైలు నంబర్లు 07864, 07465), తెనాలి-రేపల్లె (రైలు నంబర్ 07888), రేపల్లె-మార్కాపురం (రైలు నంబర్ 07889), మార్కాపురం-తెనాలి (రైలు నంబర్ 07890), తెనాలి-విజయవాడ (రైలు నంబర్ 07630) ప్యాసింజర్ రైళ్లని రద్దు చేసినట్లు గుంటూరు డివిజనల్ రైల్వే అధికారులు తెలిపారు.అలాగే, మాచర్ల-గుంటూరు ప్యాసింజర్ రైలును నడికుడి వరకే నడపనున్నారు. విజయవాడ-మాచర్ల ప్యాసింజర్ రైలును నడికుడి నుంచి మాచర్లకు, మాచర్ల-విజయవాడ ప్యాసింజర్‌ని నడికుడి వరకే నడుపుతారు.

# వివేకా కేసులో సీబీఐ సైలెంట్




కడప,సెప్టెంబర్ 15, :వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఓ ప్రజాప్రతినిధి సహా కీలక వ్యక్తుల అరెస్ట్ ఉంటుందని సమాచారం వచ్చీ రాగానే జగన్ హుటాహుటిన ఢిల్లీ టూర్ వెళ్లారు. అంతే ఏపీలో సీబీఐ అధికారులు సైలెంట్ అయిపోయారు. వివేకా హత్య కేసులో సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సహాయ నిరాకరణ చేస్తున్నది. ఎదురు కేసులు కూడా పెడుతుంది. ఈ కేసులో కీలక వ్యక్తులను అరెస్టు చేద్దామంటే.. ఢిల్లీ నుంచి బ్రేకులు పడుతుంటాయి. కింది స్థాయిలో డొంక కదిలిద్దామంటే.. వ్యూహాత్మకంగా ప్రైవేటు కేసులు వేయిస్తున్నారు. దీంతో సీబీఐ పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారిందంటున్నారు. ఇలాగైతే వివేకా హత్య కేసు విచారణ ముందుకు సాగదని కోర్టుకు సీబీఐ మొర పెట్టుకుంది. దీంతో సంచలనం రేపిన వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ చేతులెత్తేసినట్లేనా? ఎడాపెడా ఒత్తిళ్లతో అధికారులు ఇక అడుగు ముందుకు వేయలేమనే భావనకు వచ్చారా? తమపై రాష్ట్ర పోలీసులు ఎదురు కేసులు పెడుతుండటంతో నైతిక స్థైర్యం దెబ్బతిని, ముందుకు వెళ్లేందుకు జంకుతున్నారా? విపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేసిన జగనే.. అధికారంలోకి రాగానే ఆ డిమాండ్ ను పక్కన పెట్టడమే కాకుండా తన బాబాయి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని కోర్టుకు విన్నవించారు. ఈ క్రమంలోనే వివేకా కుమార్తె డాక్టర్ సునీత హైకోర్టును ఆశ్రయించారు. తర్వాత ఈ కేసులో సీబీఐ అడుగులు వేగంగా పడ్డాయి. కీలక వ్యక్తుల అరెస్టుకు సిద్ధమైన ప్రతిసారీ సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లడం రివాజుగా మారింది. అక్కడ ఢిల్లీ పెద్దలతో ఆయన ఏం మాట్లాడతారో కానీ.. ఇక్కడ మాత్రం ఈ కేసులో సీబీఐ సైలెంట్ అయిపోవడం జరుగుతోంది. వారంలో కీలక పరిణామాలు జరగనున్నాయని.. వివేకా హత్య కేసులో కీలక ప్రజాప్రతినిధి అరెస్టుకు సీబీఐ రెడీ అయిందని ఆగస్టు నెలలో విస్తృతంగా ప్రచారం జరిగింది. పులివెందులలో పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. అదే సమయంలో ఆగస్టు 21న సీఎం జగన్ ఆగమేఘాల మీద ఢిల్లీ వెళ్లారు. 22న ఢిల్లీ పెద్దలను కలిశారు. అంతే.. ఇక్కడ సీబీఐ గప్ చుప్ అయిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఈ కేసు విషయంలో సీబీఐలో ఉలుకూ పలుకూ లేదువివేకా కేసులో కీలక వ్యక్తి అరెస్టు జరగొచ్చని బలంగా వార్తలు రాగానే.. దర్యాప్తు అధికారిపై కేసులు పెడుతున్నారు. ప్రైవేటు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలాగైతే.. వివేకా హత్య కేసులో దర్యాప్తు ముందుకు సాగడం కష్టం. ఆ కేసులు కొట్టేయాలన్న మా వ్యాజ్యంపై త్వరగా విచారణ జరపండి అని సీబీఐ తరఫు న్యాయవాది హైకోర్టుకు మొర పెట్టుకున్నారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీతపైనా కేసు పెట్టారు. ఆ ఫిర్యాదులను పోలీసులకు కోర్టు రిఫర్ చేయగానే.. ఏకంగా ఏఎస్పీపైనే కడప పోలీసులు కేసు పెట్టడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో వివేకా హత్య కేసు దర్యాప్తులో వేగం కొన్నాళ్లుగా మందగించింది. కోర్టు ఆదేశాల మేరకు వివేకా హత్య కేసును చేపట్టిన సీబీఐ.. కడపలో మకాం వేసి మూలాల్లోకి చొచ్చుకెళ్లి తీగ లాగడం మొదలు పెట్టింది. ఈ కేసులో డ్రైవర్ దస్తగిరి అప్రూవర్ గా మారడం కీలక పరిణామం. దర్యాప్తులో గుర్తించిన విషయాలు, సేకరించిన సాక్ష్యాల ఆధారంగా.. వివేకా అనుచరుడు ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు దేవిరెడ్డి శంకర్ రెడ్డిపై అభియోగాలు మోపింది. ఈ కేసులో సీబీఐ ఇప్పటికి ఐదుగురిని జైలుకు పంపింది. 'అసలు సూత్రధారులు ఎవరో తేలుస్తాం' అని చార్జిషీట్ లో పేర్కొంది. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐ చేపట్టిన కేసుల్లో పకడ్బందీగా దర్యాప్తు చేస్తుంది. వివేకా హత్య కేసులోనూ అదే జరిగింది. సీబీఐ పేరు చెబితే దేశవ్యాప్తంగా బడాబడా వ్యక్తులే వణుకుతుంటారు. ఏపీలో మాత్రం సీబీఐనే వణుకుతుండటం గమనార్హం. అనేక అంశాల్లో వైసీపీ స్థానిక పెద్దల పాత్రపై లింకులు ఈ కేసులో వెలుగుచూశాయి. వీటి ఆధారంగా కీలక వ్యక్తుల అరెస్టుకు సీబీఐ రంగం సిద్ధం చేసినా.. బ్రేకులు పడుతూనే ఉండడం గమనార్హం. ఇన్ని అవాంతరాల మధ్య వివేకా హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగుతుందా? లేక సీబీఐ ఇంకా సైలెంట్ అవుతుందా? కాలమే నిర్ణయించాలి.

# కృష్ణా టీడీపీలో మరో వికెట్ డౌన్



విజయవాడ, సెప్టెంబర్ 15, :పేరుకు టీడీపీకి కంచుకోటగాని..అక్కడ మొత్తం టీడీపీలో రచ్చే నడుస్తోంది..గత ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ పరిస్తితి మెరుగవుతున్నట్లు కనిపించడం లేదు. మొదట నుంచి కృష్ణా జిల్లా అంటే టీడీపీకి అనుకూలమైన జిల్లా..కానీ గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ సత్తా చాటింది. అయితే ఎలాగైనా జిల్లాలో టీడీపీ బలం పెంచాలని చంద్రబాబు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కానీ టీడీపీ నేతలు మాత్రం ఆ దిశగా పనిచేయడం లేదు.ఎవరి పని వారిదే అన్నట్లు ఉంది. ఇక్కడ చాలామంది వైసీపీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉంది..అయినా సరే ఆ వ్యతిరేకతని టీడీపీ నేతలు సరిగ్గా ఉపయోగించుకోవడం లేదు. పైగా వైసీపీపై పోరాటం చేసే విషయంలో టీడీపీ నేతలు ఐక్యంగా ఉండటం లేదు. ఇటీవలే చంద్రబాబు, కృష్ణా టీడీపీ నేతలకు క్లాస్ ఇచ్చారు. చెన్నుపాటి గాంధీపై వైసీపీ నేతలు దాడి చేసిన అంశంలో చాలామంది టీడీపీ నేతలు సరిగ్గా స్పందించలేదు. దీనిపై బాబు..నేతలకు గట్టిగానే క్లాస్ ఇచ్చారు. అయినా సరే పూర్తి స్థాయిలో మార్పు రావడం లేదు.ఏ కార్యక్రమం చేసినా మొక్కుబడిగానే చేస్తున్నారు..అలాగే నేతల మధ్య పెద్దగా సమన్వయం ఉండటం లేదు. తాజాగా ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంబంధించిన బ్యానర్లలో బుద్దా వెంకన్న ఫోటో లేదు. దీంతో బుద్దా సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు.ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ? పార్టీ అధినేత చంద్రబాబు కొన్ని రోజుల క్రితం నేతలకు క్లాస్ తీసుకున్నప్పటికీ నాయకుల్లో తీరు మారలేదని, బ్యానర్లో తన ఫోటో లేకపోవడంపై తాను ఏమి మనస్తాపం చెందలేదని, విశాఖలో పని ఉండటం వల్ల వెళ్లిపోతున్నానని చెప్పుకొచ్చారు. కానీ వాస్తవ పరిస్తితి అయితే ఫోటో లేకపోవడమే అని తెలుస్తోంది. అంటే కృష్ణా జిల్లా టీడీపీ నేతల మధ్య సమన్వయం లేదని తెలుస్తోంది. ఇప్పటికే విజయవాడలో బుద్దా–కేశినేని నాని మధ్య ఆధిపత్య పోరు ఉంది. ఇప్పుడు ఈ రచ్చ?మొత్తానికి కృష్ణా జిల్లాలో టీడీపీ బాగుపడేలా లేదు.

# బెజవాడ ఎంపీ బరిలో అక్కినేని నాగార్జున..?



విజయవాడ, సెప్టెంబర్ 15,:రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఎప్పుడు ఏదొక సెన్సేషనల్ అంశం తెరపైకి వస్తూనే ఉంటుంది?ఇక అందులో నిజనిజాలు ఎలా ఉన్నా సరే?ఆ అంశం మాత్రం పెద్ద ఎత్తున ప్రచారం జరిగిపోతుంది. ఇటీవల అమిత్ షా?జూనియర్ ఎన్టీఆర్‌తో భేటీ అయ్యారు. అయితే వారి మధ్య ఎలాంటి చర్చ జరిగిందో ఎవరికి క్లారిటీ లేదు. అధికారికంగా మాత్రం ఆర్ఆర్ఆర్ సినిమా గురించి మాత్రమే వచ్చిందని బయటకొచ్చింది. అయితే ఇది కూడా నిజమని అనుకోవడానికి లేదు.మొత్తం మీద చూస్తే అక్కడ నిజమెంత ఉందో తెలియదు గాని వారి చర్చపై పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి?కామెంట్లు వచ్చాయి. ఎన్టీఆర్–బీజేపీకి సపోర్ట్ ఇస్తున్నారని, బీజేపీ సపోర్ట్‌తో టీడీపీ పగ్గాలు తీసుకుంటున్నారని..ఇలా రకరకాల ప్రచారం వచ్చింది. కానీ వీటిలో వాస్తవం ఎవరికి తెలియదు. ఇక ఇదే క్రమంలో తాజాగా ఏపీ రాజకీయాల్లో సరికొత్త కథ ఒకటి పుట్టుకొచ్చింది.అది ఏంటంటే?సినీ ఇండస్ట్రీలో టాప్ మోస్ట్ సీనియర్ హీరోల్లో ఒకరిగా ఉన్న నాగార్జున?వైసీపీ తరుపున విజయవాడ ఎంపీగా పోటీ చేస్తున్నారని. ప్రస్తుతం విజయవాడలో టీడీపీ బలంగా ఉంది..పైగా అక్కడ సిట్టింగ్ టీడీపీ ఎంపీ. అలాగే ఇక్కడ కమ్మ వర్గం ప్రభావం ఎక్కువ. అందుకే అదే వర్గానికి చెందిన, క్రేజ్ ఉన్న నాగార్జునని విజయవాడలో నిలబెడుతున్నారని మీడియాలో కథనాలు వచ్చేశాయి.మరి ఈ కథనాల్లో నిజమెంత ఉందంటే?నిజం పెద్దగా లేదనే చెప్పొచ్చు. ఎందుకంటే ఒకటి నాగార్జున సినీ హీరోతో పాటు?ఒక బిజినెస్మెన్.. ఇలా వ్యాపార రంగంలో ఉండే వ్యక్తి?అనవసరంగా రాజకీయాల్లోకి వచ్చి పేరు పోగొట్టుకోరు. అన్నీ తెలిసిన నాగార్జునకు విజయవాడలో రాజకీయ పరిస్తితులు తెలియకుండా ఉండవు?అక్కడ టీడీపీ స్ట్రాంగ్‌గా ఉంది. గతంతో పోలిస్తే ఇంకా బలపడింది..అదే సమయంలో జనసేనతో పొత్తు ఉంటే ఇంకా చెప్పాల్సిన పని లేదు. ఇలాంటి రిస్క్ ఉన్న చోట నాగార్జున బరిలో ఉండటం కష్టమైన పని. ఇప్పుడు రాజకీయాల్లో సినీ చరిష్మా ఎక్కువ పనిచేయదు. కాబట్టి నాగార్జున అంత తేలికగా ఎంపీగా పోటీ చేయడం కష్టం. కానీ జగన్‌కు సన్నిహితుడు కాబట్టి?వైసీపీకి పరోక్షంగా సపోర్ట్‌గా ఉండొచ్చు.

# ఇక పార్టీ తరుపున అన్న క్యాంటిన్లు

తిరుపతి, సెప్టెంబర్ 15, :తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. నిరుపేదలకు కేవలం ఐదు రూపాయలకే పట్టెడన్నం పెడుతున్న అన్న క్యాంటీన్లు సజావుగా నడవనివ్వకుండా వైసీపీ సర్కార్ అల్లర్లు చేస్తుండడంతో పాటు పలుచోట్ల వైసీపీ నేతలు అన్న క్యాంటీన్లను ధ్వంసం కూడా చేస్తున్నారు. అసలు వైసీపీ సర్కార్ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసేసింది. పేదవాడికి చౌకగా పట్టెడన్నం పెట్ట మహత్తర కార్యానికి వైసీపీ అడ్డంకులు సృష్టిస్తున్న క్రమంలో తెలుగుదేశ అంధినేత చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, పేదలకు కడుపు నిండా భోజనం పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎక్కడికక్కడ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి, పేదలకు భోజన సదుపాయం కల్పించాలని టీడీపీ నేతలను ఆయన ఆదేశించారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోను, నారా లోకేశ్ గతంలో పోటీ చేసిన మంగళగిరిలోను, నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న హిందూపురంలో, మరి కొన్నిచోట్ల మాత్రమే ప్రస్తుతం అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల కూడా అన్న క్యాంటీన్లను ఆ పార్టీ నేతలు సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. అన్న క్యాంటీన్లను సొంత ఖర్చులతో నిర్వహించాలని, స్వచ్ఛంద సంస్థలు కలిసివస్తే.. వాటి సహాయమూ తీసుకోవాలని, అలాగే తెలుగుదేశం తరపున కూడా అన్న క్యాంటీన్ల నిర్వహణకు కొంత నిధి సమకూరుస్తామని చంద్రబాబు తమ పార్టీ నేతలకు చెప్పారు.తెలుగుదేశం నేతల ఇళ్లలో జరిగే శుభకార్యాలను అన్న క్యాంటీన్లలో నిర్వహించి, భోజనాలు వాటిలోనే ఏర్పాటు చేయాలని కూడా చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది.అన్న క్యాంటీన్లు సజావుగా నడిస్తే.. టీడీపీకి మంచి పేరొస్తుందని, తద్వారా పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందనే అక్కసుతోనే జగన్ సర్కార్, ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ అన్న క్యాంటీన్లకు అడ్డు తగులుతున్నారని తెలుగుదేశం ఆరోపిస్తున్నది. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో అయితే.. అన్న క్యాంటీన్ ను కాసేపట్లో ఆయన ప్రారంభిస్తారనగా వైసీపీ నేతలు ఆ క్యాంటీన్ బ్యానర్లను చింపి వేసి ఆహార పదార్థాలున్న పాత్రలను ధ్వంసం చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలోనూ, మరికొన్ని చోట్లా కూడా రోడ్డుకు అడ్డంగా ఉన్నాయనే సాకుతో అన్నా క్యాంటీన్లను వైసీపీ నేతలు కూల్చివేశారు. అన్నా క్యాంటీన్లపై ప్రజల్లో ఆదరణ పెరిగిపోతే.. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్ల వర్షం కురుస్తుందని, తద్వారా తమ అధికారానికి ఎండ్ కార్డ్ పడుతుందని వైసీపీ నేతల్లో గుబులు పెరిగిపోతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అందుకే అన్న క్యాంటీన్లకు అడుగడుగునా వైసీపీ సర్కార్ అడ్డంకులు సృష్టిస్తోందని పేర్కొంటున్నారు.అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ అడ్డుకోవడమే కాకుండా, కొన్ని చోట్ల పోలీసులతో లాఠీచార్జి కూడా చేయిస్తుండడంతో ప్రజల నుంచి కూడా విమర్శలు వస్తున్నాయి. టీడీపీ నేతలపై దాడి చేసి, వారిని అరెస్టులు చేయిస్తున్న ఘటనలు చూసిన జనం ఆలోచనలో మార్పు వచ్చిన దాఖలాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. దాడులకు గురైన టీడీపీ నేతల పట్ల జనంలో సానుభూతి వస్తుందని, అతి తక్కువ ధరకే పేదలకు పట్టెడన్నం పెడుతుంటే వైసీపీ అడ్డుకుంటోందనే ఆగ్రహం కూడా ప్రజల్లో వస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, నిర్వహించాలని టీడీపీ అధినేత చంద్రబాబు తమ పార్టీ నేతలు, శ్రేణులకు పిలుపునిచ్చారని అంటున్నారు.


## మనం గెలవాలంటే

"మన సంస్థలను మనమే నిర్మించుకోవాలి "

బహుజన రాజ్యాధికార స్థాపనకు ప్రజాపాలన పేపర్ ని నియోజకవర్గాల వారీగా కనీసం 10 పేపర్లు అంతకంటే ఎక్కువ పేపర్లు ఆయా నియోజకవర్గాల్లో వెళ్ళేటట్టుగా నాయకులు బాధ్యత తీసుకునేటట్టుగా చేయవలెను.

బాధ్యత తీసుకునే వారికి వారి ద్వారా వచ్చిన అడ్వర్టైజ్మెంట్స్ లో 60 శాతం వారికి ఇవ్వబడును.

ఈ దిగువన తెలిపిన నాయకులు బాధ్యత తీసుకుంటున్నారు..

మిగిలిన వారు కూడా బాధ్యత తీసుకోగలిగితే మన వాయిస్ వెళ్లి గెలవడానికి సహాయకారిగా ఉంటుంది.

**Sivabhagyarao Bahujan IRS-vrs**
Chairman
**Prajapalana**

Jai puley   Jai Bheem   Jai bharath

ఈ దిగువ తెలిపిన పార్స్ సభ్యులకు ప్రజాపాలన పేపరు పంపబడును

| S.NO | NAME | DESIGNATION | PLACE |
|---|---|---|---|
| 1 | DR. Guduru Seethamahalaxmi | CWC MEMBER, AP State Incharge PARS | Vizag |
| 2 | Gunji Narasimharao | CWC MEMBER, PARS | Nellor |
| 3 | Dr. P.Paramasivan | State Vice President, Tirupathi & Chittoor PARS | Tirupathi |
| 4 | Nammi Apparao | PARS AP State Co-ordinator | Vijayawada |
| 5 | A. Balaram | AP State Co-ordinator, PARS | Pileru |
| 6 | K.Vara Prasad | AP State Secretary, Retd Teachers Vibhagamu, PARS | Bapatla |
| 7 | S.Tirupal | AP State Secretry,NGO Vibhagamu Ananthapur & Hindupur PARS | Ananthapur |
| 8 | Dasari Shyam Living Stone | Vice President, Retired Teachers Vibhagamu PARS | Bapatla |
| 9 | Kagita Achyut Puley | AP State Secretary Eluru, Machilipatnam PARS | Eluru |
| 10 | Repudi Doraka Vani | State Secretary,Humanrights Vibhagamu, Guntur &Narsaraopeta PARS | Guntur |
| 11 | Jada Vijay Kumar | Parliament President, Retd Employees Vibhagamu, PARS | Ongole |
| 12 | Mundlapati Pichiah | President,Badvel Assembly PARS | Badvel |
| 13 | P.Prakasham | Branch Manager,Sneha MACS Ponnur | Ponnur |
| 14 | Sudheer | Reporter | Narasaraopeta |
| 15 | Ratna Raju | Reporter | Nandigama |
| 16 | A.Punnarao | CEO, SNEHA MACS | Vizag |
| 17 | Ch. Chiranjeevi | Sneha Club, Ex Governor | Vizag |
| 18 | Katikala Ravi Kumar | AP State Co-ordinator, PARS | Guntur |
| 19 | P.Anand | Accounts Assistant Officer, AP Genco | Nellor |
| 20 | Kakani Prasada Rao | Assembly President, PARS | Penamalur |
| 21 | Loda Apparao | Assembly President, PARS | Rajamundry Rural |
| 22 | Stalin Babu | Assembly President, PARS | Prattipadu |
| 23 | Jakkala Krupa kumar | Presidnent of Minority section | Prodduturu |
| 24 | Kamalapuram Kiran | President of Ex.Service Man section | Jammalamadugu |
| 25 | Kommalapati Anjaneyulu | President of Building Construction Union | Kamalapuram |
| 26 | Gollapalli bhaskar | President of Education Vibhagamu | Kadapa Dist |
| 27 | Suneetha | President of Women's Vibhagamu | Pileru |
| 28 | Gangadhar rao Nukasani | PARS | Ongole |
| 29 | Nagendra Nayak | State Secretary of Engineering Vibhagamu | Kadapa |
| 30 | Bima Mahesh | Reporter | Amalapuram |
| 31 | Sri Savarala Ganesh | President of the Unorganized Labor Union | Division Chodavaram |
| 32 | P.Siddartha Ambedkar | Coordinating committee of Youth Associastions | Malkapuram |
| 33 | Ravada Satyanarayana | President of Unorganized sector workers union, | Nathavaram |
| 34 | D.Siva | Blood donors vibhagamu working President | Thagarapuvalasa |
| 35 | Sri Uppina Valasa Rao | President of youth organization | Srihari puram |
| 36 | Ghanta Rajkumar | Narasapur Parla ment NGO విభాగపు అధ్యక్షుడు | Bhimavaram |

Please contact this No:8886022523 Krishna veni , Appajee 9000621111
(Prajapalana Telugu Daily)

# ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 16, సెప్టెంబరు 2022


## ఉత్తరాంధ్రను ఏం ఉద్ధరించారు?

అమరావతి రాజధాని రైతులు తమ సమస్యలు ప్రజల దృష్టికి తెచ్చేందుకు, ఉత్తరాంధ్ర ప్రజల మద్దతు కోరేందుకు అమరావతి నుంచి అరసవెల్లికి పాదయాత్ర చేపడితే దానిపై వైసీపీ మంత్రులు, నాయకులు ఇష్టానుసారం నోరు పారేసుకొంటున్నారు. ఉత్తరాంధ్రపై దండయాత్ర అంటూ ప్రాంతాల మధ్య విద్వేషం రగిలించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకొంటున్నారని మంత్రులు అమరావతిపై విషం కక్కుతున్నారు. రైతుల పాదయాత్రను దండయాత్రగా, ఉన్మాదియాత్రగా పోల్చడం గర్హనీయం. జగన్ రెడ్డి పాదయాత్రలు చేస్తే ప్రజల కోసం చేసినట్టా, భూములు కోల్పోయిన రైతులు పాదయాత్ర చేస్తే ఉన్మాదియాత్ర, దండయాత్ర అవుతుందా? అమరావతి దెయ్యాల రాజధాని అని మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒకప్పటి దేవతల రాజధాని అమరావతిని దెయ్యాల రాజధాని అనడం వారి అహంకారానికి, అజ్ఞానానికి నిదర్శనం. వికేంద్రీకరణ పేరుతో అన్ని ప్రాంతాల అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ మంత్రులు, నాయకులు తమ మూడున్నరేళ్ల పరిపాలనలో ఉత్తరాంధ్రను ఉద్ధరించింది ఏమిటి? అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉంటే ఉత్తరాంధ్రలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేసి అదనంగా ఒక్క ఎకరానికి అయినా సాగునీరు ఇచ్చారా? కొత్తగా ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారా? ఒక్క ఉద్యోగం అయినా ఇచ్చారా? ఒక్క రోడ్డు అయినా నిర్మించారా? ఉత్తరాంధ్రకి కేంద్రం ద్రోహం చేస్తున్నా జగన్ ప్రభుత్వానిది ప్రేక్షక పాత్రే. పెట్రో యూనివర్సిటీ వంటి సంస్థల నిర్మాణం పూర్తి కాలేదు. విశాఖ మెట్రో రైలు అటకెక్కింది. గిరిజన యూనివర్సిటీ అతీగతీ లేదు. రైల్వే జోన్ అడ్రస్ లేదు. ఇక ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఒక ప్రహసనంగా మిగిలింది. ఉత్తరాంధ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును పూర్తిగా అమ్మేస్తూ ఉత్తరాంధ్రకి కేంద్రం ద్రోహం చేస్తున్నా జగన్ నోరు మెదపడం లేదు. ఉత్తరాంధ్రకు జీవనాడిగా నిలిచే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రకటనలకే పరిమితమైంది తప్ప అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద నదిగా ఉన్న వంశధారపై రెండవ దశ నిర్మాణం, మహేంద్ర తనయపై ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ప్రభుత్వ ప్రాధాన్యతల లిస్టులో ఉన్నా, ఆ దిశగా ఒక్క అడుగూ పడలేదు. వంశధారపై ఆ మధ్య ముఖ్యమంత్రి జగన్, ఒరిస్సా ముఖ్యమంత్రిని కలవడం మినహా పనిలో పురోగతేమీ లేదు. వాస్తవంగా ఈ రెండవ దశ నిర్మాణానికి కేంద్ర ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. విజయనగరం జిల్లాలో అనేక సంవత్సరాలుగా పెండింగులో ఉన్న జంఝావతి, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టులు పడకేశాయి. జిల్లాలోని తోటపల్లి కాలువల నిర్మాణం కూడా చివరి వరకు పూర్తి కాలేదు. ఇలా సాగునీటి ప్రాజెక్టులలో ఈ మూడున్నరేళ్ల కాలంలో పురోగతేమీ లేదు. ఉత్తరాంధ్రలో ఉపాధి కల్పించే పారిశ్రామికీకరణ కూడా పడకేసింది, పాదయాత్రలో మూతబడ్డ జూట్ పరిశ్రమను తెరిపిస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. జూట్, చక్కెర పరిశ్రమలను తెరిపించకపోగా విశాఖ జిల్లాలోని చిట్టివలస జూట్ మిల్లును పూర్తిగా మూసేసేలా సెటిల్మెంటు చేశారు. నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం ఆ మధ్య లాకౌట్ విధించింది. ఉత్తరాంధ్రలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రధాన రంగమయిన జూట్ పరిశ్రమ నేడు పూర్తిగా చతికిలబడి ఉపాధి కల్పన ఉత్తుత్తిగానే మిగిలిపోయింది. పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఫార్మా, రసాయన పరిశ్రమల నుంచి రక్షణకు చర్యలేమీ లేవు. విశాఖకు పరిపాలనా రాజధాని వస్తుందని మభ్యపెట్టి పెద్దఎత్తున విశాఖలో విలువైన భూములు కబ్జాలు చేశారు. విశాఖ నగరంలోని తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ కంటి ఆసుపత్రి, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్ వంటివన్నీ ఖాళీ చేయించి మరీ 15 ఎకరాల భూమిని వేలానికి పెట్టాలని నిర్ణయించారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికున్న 10.39 శాతం వాటాను అదాని సంస్థకు అమ్మేశారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను జగన్ ప్రభుత్వం సుతిమెత్తగా వ్యతిరేకించడం తప్ప, తీవ్రంగా వ్యతిరేకించిన దాఖలాలు లేవు. శ్రీకాకుళం జిల్లా పలాసలో కిడ్నీ వ్యాధి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి స్వయంగా ముఖ్యమంత్రే 2019లో శంకుస్థాపన చేసినా నేటికీ పునాది దశ దాటి ముందుకు వెళ్లలేదు. ప్రతిష్టాత్మక విజయనగరం ఎంఆర్ కాలేజి మూసివేతకు యాజమాన్యానికి ప్రభుత్వం సహకరిస్తోంది. గిరిజన ప్రాంతంలో కలుషిత నీటితో ప్రజల మరణిస్తున్నారు. రహదార్లు లేకపోవడంతో నాటు పడవల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు లోనవుతున్నారు, డోలి మోతలు కొనసాగుతూనే ఉన్నాయి. విశాఖ జిల్లా పాడేరు, అనకాపల్లి, విజయనగరాలలో మెడికల్ కాలేజీల ఏర్పాటు మంచిదే కానీ, వీటికి సరిపడా నిధులు సమకూర్చలేదు. రాష్ట్ర ప్రజల హక్కుగా ఉన్న ప్రత్యేక హెూదా, విభజన చట్టం అమలు, అభివృద్ధి నిధులు వంటివి సాధించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేకుండా తన కేసుల కోసం కేంద్రానికి సాగిలపడి రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీస్తూ, మూడు రాజధానులు వికేంద్రీకరణ అన్ని ప్రాంతాల అభివృద్ధి అంటూ ముఖ్యమంత్రి జగన్నాటకాలు ఆడుతున్నారు. మూడు రాజధానులపై చట్టం చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా, మూడు రాజధానులే తమ విధానమని మంత్రులు మాట్లాడుతూ కోర్టు తీర్పును ఉద్దేశపూర్వకంగానే ధిక్కరిస్తున్నారు. అమరావతిపై ఎన్ని పిచ్చికూతలు కూసినా, ఎంత అక్కసు వెళ్లగక్కినా రాజధాని మార్చడం సాధ్యం కాదని గుర్తించాలి. రైతులు చేస్తున్నది దండయాత్ర కాదు, ధర్మ యాత్ర అని తెలుసుకోవాలి.

## అడుగులు తడబడనివ్వకండి, రాహుల్!



సోషల్ మీడియా అంతా రాహుల్ గాంధీ ఫోటోలతో, ఎడాపెడా కామెంట్లతో సందడిగా ఉంది. కొందరికయితే, అతను ఆపద్బాంధవుడిలాగా, దైవదూత లాగా కనిపిస్తున్నాడు. మరి కొందరు, ఉందీలే మంచీకాలం ముందూముందూనా అనీ పాడుకుంటున్నారు. ఇందులో రాహుల్ గొప్పదనం ఎంత ఉన్నదో తెలియదు కానీ, ఒక చిన్న విభిన్నత కోసం, ఒక చిన్న ఊరట కోసం భారతీయ సమాజం లేదా కనీసం అందులో ఒక భాగం ఎంతగా మొహం వాచి ఉన్నదో, ఆలంబన కాగలిగే ఆశ కోసం ఎంతగా నిరీక్షిస్తున్నదో తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితులు ఏమీ బాగాలేకపోవడమే కాక, వీటికి ముగింపు కూడా కనుచూపు మేరలో కనపడడం లేదని కుంగిపోతున్న వారికి, ఇదొక ఒయాసిస్సు సమయం. నిజంగా, ఈ పాదయాత్రలో అంతటి వాగ్దానం ఉన్నదా? అభిమానుల ఆనందాతిరేకంతో పాటు, ముప్పేటగా ముసురుకుంటున్న విమర్శకుల దాడిని ఈ యాత్రికుడు అధిగమించగలడా? రాహుల్ గాంధీ అనే నేటి రాజకీయ వ్యక్తిని ఆయన నేపథ్య చరిత్ర, సొంత పార్టీ, ప్రత్యర్థి పార్టీలు, మీడియా అంతా కలసి నిర్మించాయి. గత ఎనిమిదేళ్లుగా, సకల మాధ్యమాల ద్వారా జనవశీకరణ విద్యను ప్రయోగిస్తున్న జాతీయ అధికార పార్టీ, రాహుల్ వ్యక్తిత్వాన్ని తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వచించింది. రాహుల్, ఒక నిరాసక్త మానవుడు. ఉన్నట్టుండి విదేశాలకు వెళ్లే చపలచిత్తుడు, నైట్ క్లబ్‌లో చైనా గూఢచారితో మంతనాలు చేయగల అనుమానాస్పదుడు, బాధ్యత తీసుకోవాలంటే భయపడే అర్భకుడు. పార్టీ పడవ మునిగిపోతుంటే నిమ్మకు నీరెత్తిన వేదాంతి, చాకొలేట్ బాయ్. పప్పు. ఇన్ని రకాల విశేషణాలతో సంబోధనలతో రాహుల్‌ను పక్కకు పెట్టిన ప్రధాన స్రవంతి, ఇప్పుడు ఒక్కసారిగా అతన్ని పట్టించుకోవలసి వస్తోంది. పైన చెప్పిన ఆపాదనలు కూడా, అతని దగ్గరేదో ప్రభావ శీలత ఉండబట్టే అవసరమయ్యాయి. నెహ్రూ కుదురు, గాంధీ ఇంటిపేరు. ఇందిర మనవడు, రాజీవ్ తనయుడు. కాంగ్రెస్ అనే ఒక సువిశాల సకల జనవేదికకు ఇరుసు కాగలిగిన శక్తి కలిగినవాడు. కాలం కలసిరాక, హీన స్థితికి వెళ్లినప్పటికీ 'కాంగ్రెస్ గ్రాస్' తిరిగి ఎప్పుడైనా మొలకెత్తగలుగుతుంది, విత్తనం మిగిలి ఉంటే. బిజెపి భయం అదే. 2014లో మొదటిసారి గెలిచినప్పుడు, ఆ పార్టీ ఊహించలేదు, అంతటి ఘనవిజయం వస్తుందని, కాంగ్రెస్ అంతగా పడిపోతుందని. హిందూత్వను తీవ్రస్థాయికి తీసుకువెళ్ల గలిగితే, అధికారం సుస్థిరంగా కొనసాగుతుందని కూడా ఆ పార్టీ నాడు అనుకోలేదు. అట్లా అనుకుని ఉంటే, 2014 ఎన్నికల కోసం అచ్ఛేదిన్ నినాదానికి తోడు, మత అంశాలను కూడా జోడించి ఉండేది. తరువాతి ఎన్నికలలో కూడా వరుస విజయాలు సాధించాలంటే, కాంగ్రెస్‌ను మరింతగా నామమాత్రం చేయాలి కాబట్టి, కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న నినాదం తీసుకున్నది. ఆ లక్ష్యం చాలా వరకు నెరవేరింది కాబట్టి, కాంగ్రెస్ రెండో స్థానంలో ఉన్న రాష్ట్రాల మీద, ప్రాంతీయ పార్టీల మీద గురిపెట్టాలన్న తాజా వ్యూహంలోకి దిగింది. ఈ సమయంలో ఈ నేల మీద తన ప్రాసంగికతను మరోసారి పరీక్షించుకుందామని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ అంటే, శేష కాంగ్రెస్. విడిచివెళ్లేవారు, వెళ్లబోయేవారు అందరూ పోగా మిగిలే కాంగ్రెస్. నూటా యాభై రోజుల ఆరోహణ యాత్రలో చివరకు రాహుల్ పక్కన, వెనుక నిలిచే వారే ఆ కాంగ్రెస్. ప్రజల దృష్టి నుంచి చూసినప్పుడు, ప్రధాన ప్రతిపక్షం అంటూ ఒకటి, తగినంత గొంతున్నది, ఉండడం అవసరం. ఒకే పార్టీకి తిరుగులేని అధికారం ఉండడం, అది ఎడతెగకుండా కొనసాగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు, ప్రజాసంక్షేమానికీ మంచిది కాదు. ప్రత్యామ్నాయం ఒకటి ఉండాలి అనుకున్నప్పుడు, అది కాంగ్రెస్ పార్టీయే కానక్కరలేదు. దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీలు ఏవైనా జాతీయస్థాయికి విస్తరించవచ్చు, లేదా అనేకపార్టీలు కూటమి కట్టి అధికారపార్టీతో పోటీ పడవచ్చు. అయితే, ఇప్పటికీ సాధారణ ఎన్నికలలో అతి ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటున్న రెండో పార్టీగా కాంగ్రెసే ఉన్నది. కాంగ్రెస్‌కు మునుపటి ఎన్నికలలో 19 శాతం ఓట్లు రాగా, తరువాతి స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు 4 శాతం ఓట్లు వచ్చాయి. జాతీయ అధికారపార్టీని ఢీకొట్టగల స్థాయి తనకు మాత్రమే ఉన్నదని ఏదైనా ఒక పార్టీ చెప్పుకోవాలంటే అది కాంగ్రెసే. ఓట్ల సంఖ్య పక్కన పెట్టినా, ఎక్కువ రాష్ట్రాలలో ఉనికి కలిగిన జాతీయ పార్టీ కూడా కాంగ్రెసే. ఆ హెూదాలో, విజయావకాశాలున్న ఏదైనా ప్రతిపక్ష కూటమి ఏర్పడాలంటే కాంగ్రెస్ లేకుండా సాధ్యం కాదు. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదం వెనుక బిజెపి లక్ష్యం, మరొక జాతీయస్థాయి పార్టీ లేకుండా చేయడం, మిగిలిన ప్రాంతీయ పార్టీలను కూటమి కట్టకుండా లొంగదీసుకోవడం. అయితే, కాంగ్రెస్ శుష్కించిపోతే, ఆ స్థానాన్ని భర్తీ చేయాలని, లేదా, ఏదో కూటమితో ఒక బేరమాడగల శక్తిగా మారాలని ప్రయత్నిస్తున్న పార్టీలు లేకపోలేదు. వాటికి కూడా రాహుల్ గాంధీ పాదయాత్ర చిరాకు పుట్టిస్తున్నది. కాంగ్రెస్ పని అయిపోయిందని కేజ్రీవాల్ గుజరాత్‌లో ప్రకటించేశాడు. బిజెపి ముందు నంగినంగిగా ఉంటూ వబ్బం గడుపుకుంటున్న 'ఆప్' పార్టీ, కాంగ్రెస్ ఓటు బ్యాంకును మాత్రం కబళిస్తున్నది. ఢిల్లీ, పంజాబ్ తరువాత, ఇప్పుడు గుజరాత్. రేపు వీలయితే గోవా. రాహుల్ యాత్ర ఆరంభ సమయంలోనే, కెసిఆర్‌కు 'జాతీయ' ఆవేశం వచ్చింది. దేవతా వస్త్రాలను ఎవరూ ప్రశ్నించరు కాబట్టి సరిపోయింది కానీ, కెసిఆర్ జాతీయ ప్రయత్నాలకు అర్థమే లేదు. ఆయన దేశరాజకీయాలలోకి వెడుతున్నారా, జాతీయ పార్టీ పెడుతున్నారా? పార్టీ పెట్టకుండా కూడా జాతీయ రాజకీయాలలో క్రియాశీల పాత్ర పోషించవచ్చు. ఎన్టీయార్ భారతదేశం పార్టీ ఆలోచనను విరమించుకున్నాక కూడా నేషనల్ ఫ్రంట్ నాయకుడిగా జాతీయ పాత్ర పోషించారు. అఖిల భారత అన్నాడిఎంకె వలె నామమాత్రపు జాతీయపార్టీ అయితే ఉపయోగమేమిటి? ఇతర జాతీయ పక్షాల నడుమ మాత్రం తెలంగాణ జాతీయపార్టీకి దొరికే అదనపు ప్రతిపత్తి ఏమిటి? తమ పార్టీ నేతల చేతనే ప్రకటనలు ఇప్పించుకుని జాతీయపార్టీ పెట్టాలనుకోవడం హాస్యాస్పదంగా ఉన్నది. చివరకు ఒక్కడు, పాపాల భైరవుడు, పక్కరాష్ట్రం నుంచి కుమారస్వామి గౌడ వచ్చి, జాతీయపార్టీ పెట్టమని ప్రోత్సహించాడు, అంతే తప్ప, ఆ పార్టీలో తాను చేరతానని అనలేదు. ఇద్దరూ కూర్చుని, మధ్యలో కాంగ్రెస్‌ను విమర్శించారు. ప్రత్యామ్నాయం కాగలిగిన శక్తి కాంగ్రెస్‌కు పోయిందట. పాదయాత్ర, కర్ణాటక ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని తప్ప, బిజెపిపై పోరులో కాంగ్రెస్ వేట ఎందుకు? ప్రాంతీయ పార్టీలు అన్నీనో కొన్నో ఒక జట్టుగా ఏర్పడితే కూడా, కేంద్రం దూకుడును నిరోధించవచ్చును అనుకున్నా, కాంగ్రెస్‌ను విడిచిపెట్టడానికి శరద్ పవార్, స్టాలిన్, తేజస్వి, కొత్తగా నితిశ్ ఎవరూ సిద్ధంగా లేనప్పుడు, ఈ 'జాతీయ' ప్రయత్నాలు సందేహాస్పదం అవుతాయి, అనుమానాస్పదం కూడా అవుతాయి. పాదయాత్రకు కార్పొరేట్ జాతీయ మీడియా కూడా ఎంతో కొంత ప్రచారం ఇవ్వక తప్పనిస్థితి ఏర్పడడంతో, ప్రత్యర్థులకు వెనువెంటనే ప్రతికథనాలు రూపొందించక తప్పడం లేదు. బుధవారం నాడు మోదీ మీద రాహుల్ 'చైనా విమర్శ' చేసిన వెంటనే విరుగుడుగా బిజెపి గోవాలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మింగింది. ప్రజలతోను, వాస్తవికతతోనూ సంబంధం లేని రాచబిడ్డ అని నిన్న నిందించినవారే ఇప్పుడు, రాహుల్ యాత్ర అవసరమా అని దీర్ఘాలు తీస్తున్నారు. రాహుల్ రానున్న ఐదు నెలల పాటు రోడ్ల మీద ఉంటాడని, ప్రతిరోజూ వార్తలలో ఉంటాడని గమనించినప్పుడు, పర్యవసానాలను అంత తేలికగా తీసిపారేయలేము. అన్నిటికి మించి, ఇది భారత్ జోడో యాత్ర. ఎన్నికల యాత్ర కాదు. గుజరాత్‌లో యాత్ర ఎందుకు లేదు, యూపీలో రెండు రోజులే ఎందుకు అని ప్రశ్నిస్తున్నవారు, దీన్ని ఎన్నికల సన్నాహక యాత్ర అనుకుంటున్నారు. కానీ, రాహుల్ గాంధీ తాను ఈ యాత్రను ఒక విలువను, సందేశాన్ని ప్రచారం చేయడానికి ఉద్దేశించినట్టు చెబుతున్నారు. ఆ సంకల్పం మంచిది. ప్రధాని నరేంద్రమోదీ జనంలో సంచరించరని, విలేఖరులను ముఖాముఖి కలుసుకోవడానికి కూడా సంకోచిస్తారని తెలుసు. అటువంటప్పుడు, ఒక రాజకీయ నాయకుడు జనం మధ్యలో ఇంత సుదీర్ఘకాలం మెలగడం, సంభాషించడం తప్పనిసరిగా ప్రత్యేకమే. జనంతో ప్రత్యక్ష సాన్నిహిత్యం, రకరకాల మీడియా సృష్టించే అభిప్రాయాలను దాటి జనంలో నాటుకుంటుందని చరిత్ర చెబుతుంది. రాజకీయార్థిక విధానాలలో తన ప్రత్యేకత ఏమిటో ఈ యాత్రలో రాహుల్ చెప్పాలి. ఇతరులకు భిన్నమైనవే కాదు, తన పార్టీ పాత విధానాలకు భిన్నమైనవి తానేమి ముందుకు తెస్తాడో చెప్పాలి. ఆశించినంత తేడా ఏమీ ఉండదని, అంతిమంగా ఆశాభంగాలు తప్పవనీ అనిపించవచ్చు కానీ, ప్రయత్నాల మధ్యనే ప్రస్థానం సాగుతుంది. భ్రమో, ఆశో లేకపోతే రేపటిలోకి ప్రయాణమే ఉండదు. విభజన రాజకీయాలను, విద్వేష సాంస్కృతిక వాతావరణాన్ని వ్యతిరేకించడంతో పాటు, రాహుల్ సానుకూల, నిర్మాణాత్మక ప్రతిపాదనలు ఏమిటో చెప్పాలి. అసమ్మతి మీద, జనాందోళనల మీద తొక్కిపెట్టిన ఉక్కుపాదాన్ని తొలగిస్తానని చెప్పాలి. ఇవన్నీ ఎన్నికల వాగ్దానాల్లాగా చెప్పనక్కరలేదు, ప్రజాస్వామిక ఆకాంక్షలుగా గుర్తించి యాత్రలో ప్రచారం చేయాలి. యాత్ర సాగుతుంటే, హీన రాజకీయ ప్రకటనలు కాకుండా ఉదాత్తమైన విలువల గురించి సంభాషిస్తుంటే, ప్రజావ్యతిరేక పరిణామాలను నిలదీస్తుంటే, గాలి అదే మళ్లుతుంది. పార్టీలో కూడా తాలూతప్పా చెదిరిపోతుంది. విద్యావంతులు, సంస్కారవంతులు, ద్వేషరాజకీయాలను వాంఛించనివారు, అభాగ్యులు, బాధితులు తన మీద పెట్టుకున్న ఆశలను గుర్తించి ముందుకు నడిస్తే, 1970లలో జయప్రకాశ్ నారాయణ్ అంత ప్రభావశాలి అవుతారు. జాతీయోద్యమం నాటి కాంగ్రెస్ వారసత్వానికి అర్హత సంపాదిస్తారు. చరిత్ర ఇస్తున్న అవకాశం ఇది.

## పూరింటి కూసం పక్కనే...

అంతా
అలికేసినట్టుంది
కొన్ని మురికి చారలు
ఎక్కిరిస్తాండాయి.

మూడు
రాతి గుండ్ల పైన
మూత లేని మట్టి కుండ
నాల్గు మెతుకుల్ని
లోపలే వేసేసుకుని
మింగలేక చావలేక
ఆడనే కూచుంటాది.

ఆ కూసం పక్కనే
కొక్కీకి మెడ తగిలించి
జీవచ్ఛవమైజి
ఒట్టి జేబుతో
అంగీ వేలాడుతుంటాది.

పూరింటి పైచూరు
పొగబారి
నిండా మునిగిపోతా
కునుకు లేని కంటికి
జోల పాడుతుంటాది.

ఎల్లకిలా పడిన తట్ట
ఆకలి పేగుల్ని లెక్కెడతా
ఓ మూలకు ఒరిగి
కన్నీటిని తాగుతుంటాది.
మా పూరింటి
ఆ కూసం పక్కనే
కూసింత జాగాలో
రవ్వంత ఎసరు
ఎప్పుడూ
మరుగుతుంటాది.

ఆ పక్కనే
వంగిపోయిన తాళ్ళతో
వయసైపోయిన



చిన్న కట్టె మంచం
తూలుతుంటాది.
గబ్బిలాలు
తుర్రుమని లేచినా
నిగ్రహానికి
పట్టాభిషేకం చేసి

అదిగో
ఆ పూరింట్లో
ఆ కూసం పక్కనే
ఆఖరి దాకా తొంగోవాల్సిందే.

**– నరెద్దుల రాజారెడ్డి,**

## ఎంపీ కేశినేని నాని ఆఫీస్ నందు తెలుగు తమ్ముళ్లతో పండుగ వాతావరణం



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని)ని కేశినేని భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర టీడీపీ బి సి సెల్ అధికార ప్రతినిధి గా నియమితులైన గూడెల శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన బూర కనకరావు,కార్యదర్శిగా నియమితులైన నవిరి మహేష్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గా నియమితులైన బెవర సాయి సుధాకర్, కార్యదర్శిగా నియమితులైన ఆలుగండ్ల సుబ్బారెడ్డి,తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఎన్టీఆర్ జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలుగా నియమితులైన. పైడుమాల సుభాషిణి . ఈ సందర్భంగా విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని) వారిని అభినందించి,ప్రజల సమస్యలపై స్పందిస్తూ, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కేశినేని సూచించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి తనయుడు. ఎమ్మెస్ బేగ్.. పశ్చిమ నియోజకవర్గం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు. నగరాల సంఘం నాయకులు. నూతనంగా పదవులు తీసుకున్న నాయకులు. మైనార్టీ నాయకులు.. తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## పూజిత మహిళా సొసైటీ ఆఫ్ సోషల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ వారి ఉద్ధంటి సునీతకు సత్కారం



విజయవాడ ,ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు సహకారంతో ఈరోజు ఉదయం గుణదల ఒకటో డివిజన్ లోని మడోనా హైస్కూల్ నందు పూజిత మహిళా సొసైటీ ఆఫ్ సోషల్ డెవలప్మెంట్ అనే స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో గత 90 రోజుల నుండి మడోనా స్కూల్ నందు చేతి కుట్టు మరియు మిషన్ కుట్టు శిక్షణ జరిగింది ముగింపు కార్యక్రమంలో ఇక్కడ శిక్షణ తీసుకొని పని నేర్చుకున్న మహిళలకు అభినందనలు తెలియజేసిన ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్ధంటి సునీత సురేష్. మాట్లాడుతూ మహిళలన్నీ రంగాల్లో రాణిస్తున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి చేతి పనుల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. శిక్షణ ఇచ్చినటువంటి సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు త్వరలో కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టు మిషన్లు ఇవ్వడం జరుగుతుందని వైయస్సార్ సిపి నాయకులు సురేష్. తెలియజేసినారు.

## అర్జీలు సక్రమంగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి



గుంటూరు,ప్రజాపాలన ప్రతినిధి: స్పందన, సచివాలయాల ద్వారా సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలు నిర్దేశిత సమయంలో రీ ఓపెన్ కాకుండా సక్రమంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. సమీర్ శర్మ జిల్లా కలెక్టర్ల కు సూచించారు. గురువారం సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. సమీర్ శర్మ స్పందన, మ్యూటేషన్ ధరఖాస్తుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాల సేవలు, పేదలందరికి ఇళ్ళ పథకం ఇళ్ళ నిర్మాణాలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, సమగ్ర భూ సర్వే పై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. సమీర్ శర్మ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాల్లో అపరిశుభ్రత వాతావరణం లేకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన, మ్యూటేషన్ ధరఖాస్తుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాల సేవలు, పేదలందరికి ఇళ్ళ పథకం ఇళ్ళ నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, సమగ్ర భూ సర్వే పై స్పందన, సచివాలయాలు తదితర అంశాలపై జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. సమీర్ శర్మ సమీక్ష నిర్వహించి జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు అందించారు. గుంటూరు కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస రెడ్డి, డీపీవో కేశవ రెడ్డి,సీపీవో శేషశ్రీ, డీఈవో శైలజ, హౌసింగ్ ఈ.ఈ శంకర రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేశంలో మతతత్వ రాజకీయాలకు స్వస్థి చెప్పాలి: జమియతుల్ ఉలమా నాయకుల సమావేశంలో ప్రముఖుల పిలుపు



గుంటూరుప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలామ్ షాదిఖానాలో జమియతుల్ ఉలమా -ఎ - హింద్ గుంటూరు జిల్లా వారి ఆధ్వర్యంలో సద్భావన్ సంసద్ కార్యక్రమం నిర్వహించారు . గురువారం ఉదయం జరిగిన సమావేశంలో



వివిధ మతాలు పార్టీల పెద్దలు పాల్గొని మత విద్వేషాలు లౌకితత్వం పై చర్చించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ శాసనమండలి సభ్యులు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల జమియతుల్ ఉలమా అధ్యక్షులు హాఫిజ్ పీర్ షబ్బీర్ పాల్గొని మాట్లాడుతూ దేశానికి లౌకిక వాదం ఎంతో అవసరమని అన్నారు . లౌకిక వాదానికి ప్రతీకగా నిలిచే భారదేశంలో నేడు మతత్వం మరియు ద్వేషం గరిష్ట స్థాయికి చేరుకున్నాయని అన్నారు . ఇవి భారతదేశ భాగస్వామ్య సంస్కృతి మరియు విలువలకు ప్రత్యక సవాల్ గా మారాయని అన్నారు . శాంతి భద్రతల స్థాపనకు మరియు మానవ హక్కుల స్థిరమైన అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నాయని అన్నారు . జమియతుల్ ఉలమా వాటిని అరికట్టి దేశంలో ప్రజల మధ్య రాగ ద్వేషాలు లేకుండా చూసేందుకు అన్ని మతాల వారితో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు . ఈ కార్యక్రమంలో హాఫిజ్ రాష్ట్ర కార్యదర్శి ఖాలిక్ , గుంటూరు జిల్లా జమియతుల్ ఉలమా అధ్యక్షులు ముఫ్తి అబ్దుల్ బాసిత్ , జిల్లా ప్రధాన కార్యదర్శి ఖారి ఉస్మాన్ , జిల్లా కార్యదర్శి మౌలాన ఇస్మాయిల్ ఇంకా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మహబూబ్ షరీఫ్ , టీడిపి తూర్పు ఇన్చార్జి మహమ్మద్ నశీర్ అహ్మద్ , మైనార్టీ నాయకులు ' షేక్ జియావుర్ రహమాన్ ఇంకా సర్వమత ప్రముఖులు పాల్గొన్నారు .

## వైయస్సార్ షాదీ తోఫా పేరుతో మైనార్టీలను మోసం చేస్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వం



గుంటూరు, ప్రజాపాలన ప్రతినిధి: వైయస్సార్ షాదీ తోఫా పేరుతో మరోసారి మైనార్టీలను వైఎస్ జగన్ రెడ్డి మోసం చేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ సెల్ ఉ పాధ్యాక్షులు హాజీ షేక్ అఫ్జల్ అన్నారు . అధికారంలోకి రాగానే లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి నమ్మబలికి , మైనార్టీ ఓట్లతో గెలిచిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు దాటుతున్న దుల్హన్ పేరిట ఇస్తానన్న లక్ష రూపాయలు ఇవ్వకుండా మోసం చేసుకుంటూ వచ్చి , తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వస్తున్న పథకాలను కూడా తీసి వేసి మైనార్టీ ఆడపడుచులు రోడ్లెక్కి నిరసనలు తెలిపి , మైనార్టీ సోదరులు ఆందోళనలు జరిపి చివరకు కోర్టుకెక్కితే కోర్టు ముట్టికాయలు వేసిన తర్వాత ఇప్పుడు మరలా మోసం చేయడానికి అలవికాని షరతులతో కూడిన జీవో ఇవ్వడం మైనార్టీలను మోసం చేయడానికేనని అన్నారు . . రాష్ట్రమంతా మైనార్టీలలో వచ్చిన వ్యతిరేకతను గమనించి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మూడున్నర సంవత్సరాల తర్వాత ఇటువంటి జీవో ఇవ్వడం మైనార్టీలను పచ్చి దగా మోసం చేసినట్లే అని విమర్శించారు . వధూవరువులు ఇద్దరు టెన్త్ క్లాస్ పాస్ అవడం , కరెంటు రీడింగ్ 300 యూనిట్లు దాటకుండా ఉండటం , ఆదాయం గ్రామీణాల్లో అయితే 10,000 అర్బన్ లో అయితే 12000 దాటకుండా ఉండటం , ఇంకా కొన్ని అలవికాని షరతులు పెట్టటం చూస్తుంటే మైనార్టీల పై మీ ప్రేమా చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం అవుతుంది అన్నారు . మీకు మైనార్టీల పై నిజమైన ప్రేమ చిత్తశుద్ధి ఉంటే ఈ షరతులన్నీ సడలించి ఇస్తాం అన్న లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు . అధికారంలోకి రావడానికి కల్లబొల్లి మాటలు చెప్పి తెలుగుదేశం ప్రభుత్వం పై అవాస్తవాలు చెప్పి ఆనాడు పాదయాత్రలో అక్కాచెల్లెళ్లకు లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి నమ్మబలికి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు మోసం చేసుకుంటూ వచ్చిన వైసీపీ ప్రభుత్వం చివరికి కోర్టు మొట్టికాయలు మైనార్టీలో వచ్చిన వ్యతిరేకతను పసిగట్టి ఇప్పుడు మరలా మోసం చేయడానికి ఈ కొత్త రకం షరతులతో కూడిన జీవోను ఇచ్చి మరలా మైనార్టీలను మోసం చేయడానికి చూస్తున్నారు . ఈసారి మైనార్టీ సోదర సోదరీమణులు మీ మాయమాటలు నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేరు అని అన్నారు . ఎన్నికలు ఎప్పుడు వస్తాయో మీకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు .

## దేశంలో ఏ రాజకీయ పార్టీ అందించని బీమా...!

**దిక్కు కోల్పోయిన కుటుంబానికి పెద్ద దిక్కు జనసేన బీమా...!**
**తుమ్మలపాలెం మేకల రాజ కుటుంబానికి 5లక్షల జనసేన బీమా చెక్కును అందించిన నాదెండ్ల..!**
**పీ ఏ సి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ కు ఘన స్వాగతం పలికిన మైలవరం జన సైనికులు..!**



ఇబ్రహీంపట్నం ప్రజాపాలన ప్రతినిధి: జనసేన పీ ఏ సి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఇబ్రహింపట్నం పర్యటన దిగ్విజయంగా సాగింది.. నాదెండ్ల మనోహర్ పర్యటనలో భాగంగా మైలవరం జన సైనికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.. తుమ్మలపాలెం వేదికగా జరిగిన మహోన్నత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. తుమ్మల పాలెం కి చెందిన మేకల రాజ రోడ్డు ప్రమాదం లో మృతి చెందారు.. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం లో పెద్ద దిక్కు కోల్పోవడం తో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.. ఈ నేపద్యంలో మృతుడు 500 వందల రూపాయల తో తీసుకున్న జనసేన క్రియాశీల సభ్యత్వం ఆ కుటుంబానికి కోండత అండగా మారింది.. జనసేన ప్రమాద బీమా కింద 5 లక్షల రూపాయల చెక్కు ను బాధిత కుటుంబానికి నాదెండ్ల మనోహర్ చేతల మీదుగా అందించారు.. రోడ్డున పడిన తమ కుటుంబాన్ని ఆదుకున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) , చింతల లక్ష్మి, పోలిశెట్టి తేజ, జనసేన జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెల్లంపల్లి శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు: షేక్ తాజుద్దీన్

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: మీడియా సమావేశంలో పశ్చిమ నియోజకవర్గం టీడీపీ మైనారిటీ నాయకులు



షేక్ తాజుద్దీన్ మాట్లాడుతూ వెల్లంపల్లి శ్రీనివాస్ టీడీపీ నాయకులు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు ఎందుకంటే పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయి వచ్చే ఎన్నికలలో డిపాజిట్లు కూడా రావని తెలిసి పిచ్చెక్కి మాట్లాడుతున్నారు అనిపిస్తుంది మీరు ప్రజల్లోకి రావడానికి పోలీస్ బలగంతో భయంతో నియోజకవర్గంలో తిరుగుతున్నారు మీరు గద్దె రామ్మోహన్ రావు రాజీనామా చేయండి అనడం చాలా విడ్డురంగా ఉంది ముందు వైసీపీలో మీకు టికెట్ ఉందా లేదా తెలుసుకుంటే బాగుంటది అవినీతి సొమ్ము అరగక మీరు ఏది పడితే మాట్లాడడం సారి కాదు ముఖ్యంగా మన పార్లమెంట్ సభ్యులు కేశినేని నాని గారి గురించి అవకులు చవాకులు మాట్లాడానికు సరిపోరు అది గుర్తు పెట్టుకోవాలి ముస్లిం మైనారిటీ ఓట్లతో గెలిచి ముస్లింలకు నిండా ముంచిన ప్రభుత్వం మిది వచ్చే 2024 ఎన్నికలలో మీ పార్టీ కనుమరుగువడం ఖాయం అని తెలిపారు.

## అమరావతి రైతుల పాదయాత్రలో పాల్గొన్న దేవినేని ఉమా



గుంటూరు (వేమూరు),ప్రజాపాలన ప్రతినిధి: అమరావతి రాజధాని చంద్రబాబు నాయుడు ఏవిధంగా డిజైన్ చేశారో అదేవిధంగా ప్రపంచ స్థాయి రాజధానిగా ముందుకు వెళుతుంది. జగన్ రెడ్డి ఎన్ని కక్షలు పెట్టుకున్న అంగుళం కూడా కదిలించలేదున్యాయం కోసం, ధర్మం కోసం, రాజధాని కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం రైతులు పాదయాత్ర చేస్తున్నారు, ఎవరెన్ని కారుకూతలు కూసిన అవన్నీ బాధ్యతలేని మాటలుఅధికార పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు ఈ పాదయాత్రలో భాగస్వామ్యం అయ్యాయిమా ఇంటి ముందు నుంచి రావొద్దని అన్నారు అంటే మీ కర్మ అది..! స్వామి వారి రథాన్ని వద్దంటున్నారుపోలిసులను అడ్డం పెట్టుకొని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారుఈ ప్రభుత్వానికి పోయె రోజులు దగ్గరకు వచ్చాయి, తొందరలోనే ఈ ప్రభుత్వం పోతుంది ... జై అమరావతి అని మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు .

## బీఈడీ విధుల పేరిట భారీ వసూళ్లు దారుణం

గుంటూరు, ప్రజాపాలన ప్రతినిధి: బిఈడి ప్రయోగ పరీక్షల విధులను ఇప్పిస్తామంటూ చీరాల,ఒంగోలు,బెస్తవారిపేట లోని కొందరు బిఈడి ప్రిన్సిపల్స్,లెక్చరర్లు బిఈడి అధ్యాపకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఏ ఎన్ యూ బిఈడి దళిత అధ్యాపక సంఘం నేతలు వర్ల రాజు, విలియం ఫెడ్రిక్ లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.చీరాల, బెస్తవారిపేటకు చెందిన బిఈడి ప్రిన్సిపల్స్ నేతృత్వంలో బిఈడి థియరీ పరీక్షలలో తెనాలి,దర్శి,చీరాలలో పరిశీలకులుగా నియమిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు వసూలు చేశారని ఆరోపించారు.ప్రతి కళాశాల నుంచి కొందరు తనిఖీ బృందం సభ్యులు రూ. 15 వేల నుంచి 25 వేల వరకు వసూలు చేశారన్నారు.చీరాల, బెస్తవారిపేట,తర్లుపాడులలోని కొందరు అధ్యాపకులు వర్సిటీలోని కొందరికి ముడుపులు ముట్ట చెప్పి ప్రాక్టికల్ ఎగ్జామినర్లుగా, తనిఖీ బృందం సభ్యులుగా ఒకేసారి విధులు నిర్వహించారు.కొందరు బిఈడి కళాశాలల సిబ్బంది తనిఖీ బృంద సభ్యులుగా కళాశాలలోను బెదిరించి లక్షలాది రూపాయలు వసూలు చేశారన్నారు. ఇంటర్,డిగ్రీ కళాశాలలో పనిచేసే వారిని బీఈడీ లెక్చరర్ లంటూ రిలీవింగ్ లతో పరిశీలకులుగా,తనిఖీ బృందం సభ్యులుగా చీరాలలోని ఒక సిండికేట్ నియమించి భారీగా ముడుపులు దండుకుంటున్నారని ఆరోపించారు.చీరాల కేంద్రంగా సాగుతున్న అక్రమ వసూళ్లపై విద్యాశాఖ మంత్రి స్పందించి దళిత బిఈడి అధ్యాపకులకు న్యాయం చేయాలని కోరారు.

## కలెక్టర్ ని కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి



గుంటూరు,ప్రజాపాలన ప్రతినిధి: గురువారం కలక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి ని సన్మానించి పూల కుండి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట పట్టణంలో శ్రీరామ్ తాతయ్య అధ్వర్యంలో 65వ రోజు అన్నా క్యాంటీన్

జగ్గయ్యపేట, ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ కి జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ , తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షులు నెట్టెం రఘురాం ఆశీస్సులతో, జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఏలూరి శ్రీనివాసరావు, వీర కుమారిల అత్తగారైన కాకాని తులశమ్మ పేరున జగ్గయ్యపేట అన్న క్యాంటీన్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏలూరి శ్రీనివాసరావు , వీర కుమారి , శ్రీరాం చినబాబు, ఇంటురి రంగయ్య , కన్నెబోయిన రామలక్ష్మి , కానురి కిషోర్ , కేళి నాగేశ్వరావు , బొజ్జ శ్రీనివాసరావు, బండి పెద్ద వేంకటేశ్వర్లు, మల్లెల వేణుగోపాల్ అట్లూరి వెంకటేశ్వరరావు సామినేని మనోహర గారు, బొందిలి బాలాజీ సింగ్ గార్ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గొట్టే నాగరాజు, పెరం సైదేస్వరారవు, గెల్ల వైకుంటేశ్వరారవు, కర్ల జోజి, కుంచపర్తి నాగేశ్వరావు,కొర్రకుటి సైదులు ,మారేపల్లి శౌరి, షేక్, అక్బర్, షరీఫ్, పితాని హరినాథ్, షేక్ ఇంతియాజ్, నవీన్ ఉమ్మర్, లక్ష్మన్, సామి నేని దుర్గాప్రసాద్, కాశీ,ఎస్ఎల్టి చిట్టీ,చెరుకూరి నాగరాజు,గంజి కొండ,కాపా హరి, రంగా రాంబాబు, వెంకయ్య,సర్వేపల్లి శ్రీను, మరియు ఎస్ఎల్టి స్టాప్ పాల్గొన్నారు.

## కోటి పదిలక్షల రూపాయలతో నాడు నేడు పనులకు అంకురార్పణ



కంచికచర్ల సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలు పాఠశాలలు అభివృ ద్ధి పథంలోకి తీసుకువచ్చి పేద విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించాలనే ఉద్దేశంతో నాడు నేడు పనులకు శ్రీకారం చుట్టింది దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత నాడు నేడు పనులు జరుగు తున్నాయి ఈ పనుల్లో భాగంగాపట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా రూ.కోటి పది లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శాసనసభ్యులు మొండితోక జగన్ మోహ న్ రావు గురువారం శంకుస్థాపన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి నాడు -నేడు కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలలు- కళాశాలలు- ఆస్పత్రుల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేలా అభివృద్ధి చేస్తున్నారని , విద్యార్థుల చదువులకు ఎ టువంటి ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమై న అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసేలా పెద్ద ఎ త్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు ,ఈ కళా శాల ప్రాంగణంలో మహిళా డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని , ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూ డా పంపడం జరిగిందని , త్వరలోనే మహిళా డిగ్రీ క ళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపా రు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్ , జడ్పిటిసి ,ఎంపీటీసీ సభ్యులు , మండల పార్టీ అధ్య క్షులు , కళాశాల ప్రిన్సిపాల్ , అధ్యాపకులు , పలువు రు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య 62వ జయంతి వేడుకలు



నందిగామ సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి మం డల పరిధిలో కంచల గ్రామంలో మోక్షగుండం విశ్వేశ్వ రయ్య 62వ జయంతి వేడుకలు తెలుగుదేశంపార్టీనా యకులు వీరంకి వీరాస్వామఆధ్వర్యంలో ఘనంగా జ రిగాయి ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటిం చారుఈసందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య భారత దేశపు ప్రముఖ ఇంజి నీర్ అని, ఆయనకు 1955 సంవత్సరంలో భారతదే శపు అత్యంత పురస్కారం అయినా భారతరత్న ఆ యనకు లభించిందని అంతేకాకుండా ఆయన ప్ర జలకు చేసినా సేవలను గుర్తించి ఆనాడు బ్రిటీష్ ప్ర భుత్వంజార్జి సెయింట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ “ బిరుదు ఇచ్చి సత్కరించారని పేర్కొన్నారు భారత దేశంలో ఆయన జన్మ దినమైన సెప్టెంబర్ 15.ను ఇంజినీర్స్ డే గా జరుపుకుంటున్నా మని వారి సేవలను కొనియాడారు

## గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన, గ్రామ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు



అంబాజీపేట:సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి :స్వచ్ఛభారత్ భాగంగా ఈ రోజు పి. గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మాచవరం గ్రామపంచాయతీ సర్పంచ్,నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభ లో ప్రజా ప్రతినిధులు గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఈ సమావేశం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెప్టెంబర్ నుంచి వచ్చే నేల అక్టోబర్ 2 వ తారీఖు వరకు రోజువారి కార్యక్రమాల పనులను గురించి చర్చించడం జరిగింది. గ్రామాల్లో చెప్పుచున్న పారిశుధ్యం కార్యక్రమాలు ద్వారా వ్యక్తిగత ఆరోగ్యము సామాజిక ప్రయోజనాలను గురించి ప్రజలకు అవగాహన చేస్తూ..తెలియపరచుట గురించి , మరియు గ్రామం 'స్వచ్ఛ ' గ్రామంగా తీర్చు దిద్దుటం . గురించి చర్చించడం జరిగింది. అంతేకాకుండా.రేపటి నుంచి గ్రామంలో అక్టోబర్ 2 వరకు ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు ఉంటాయని సర్పంచ్ కుమారి సుబ్బారావు తెలియ పరచారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీవివి కుమార్ , ఎంపీటీసీ మట్టా పార్వతి,వార్డ్ సభ్యులు కొర్లపాటి వెంకటేశ్వర, ఢిల్లీ గోసింగి సత్యనారాయణ, కోట గోపి, మట్టపర్తి సాంబశివరావు, నెల్లి దుర్గాప్రసాద్, కుసుమ విజయ్ కుమారి, నేదునూరి సంధ్య ,కోమలి విజయశ్రీ, ఉ ండమట్ల విజయలక్ష్మి, ఉందుర్తి నాగబాబు , మట్టా వెంకటేశ్వరరావు, గుమస్తా శ్రీనివాసరావు ,మేస్త్రి రాంబాబు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రుల రాజధాని ఎప్పటికి అమరావతే: డాక్టర్ కోడెల శివరాం




సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి :ప్రజాభిష్టం పొందిన రాజధాని అమరావతేనని అటువంటి రాజధానికి అడ్డుపడతాం అంటే చూస్తూ ఊరుకోమని తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు, యువనేత డాక్టర్ కోడెల శివరామ్ హెచ్చరించారు. అమరావతి నుండి అరసవెల్లికి జరుగుతున్న మహా పాదయాత్రలో గురువారం యువనేత కోడెల శివరామ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యువనేత డాక్టర్ కోడెల శివరామ్ మాట్లాడుతూ అన్న నందమూరి తారకరామారావు ఆశయాలుకు అనుగుణంగా ప్రజానేత చంద్రబాబునాయుడు తన ఆంధ్రప్రజల భవిష్యత్తు ప్రణాళికకు అద్దంపటేల ప్రజలందరి చేత ఆమోదింపబడిన రాజధాని అమరావతి అని అటువంటి రాజధానినీ మార్చి మూడు రాజధానులు చేస్తాం అనడం జగన్ రెడ్డి పైశాచత్వనికి నిదర్శనం అన్నారు. పరిపాలన వికేంద్రీకరణ పేరుతో వైసిపి నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆంధ్ర ప్రజలను మోసం చేస్తున్నారని యువ నేత డాక్టర్ కోడెల శివరాం ఎద్దేవా చేశారు. తన తండ్రి స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆంధ్ర ప్రదేశ్ తొలి శాసనసభాపతి గా ఎన్నికైన సమయంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అమరావతి అనే రాజధాని అన్నివిధాలా అనువుగా ఉంటుందని ప్రతిపాదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి మనసు మార్చుకుని ఆంధ్ర రాష్ట్ర ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకొని ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రాజధాని అమరావతి గానే ఉండాలని సూచించారు. రాబోయే 2024 ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం జెండా తప్పక ఏర్పడుతుందని ప్రజానేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా కావడం తథ్యమని అప్పుడైనా జగన్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని యువ నేత కోడెల శివరాం హెచ్చరించారు. కార్యక్రమంలో కోడెల వెంట సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళా నాయకులు, తెలుగు యువత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి విస్తృత సమావేశం



వీరులపాడు సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి:సిపి ఎం మండల విస్తృస్తాయి సమావేశం స్థానిక పార్టీ కా ర్యాలయము నందు సీనియర్ కామ్రేడ్ వట్టికొండ పా ర్థసారథి అధ్యక్షతన జరిగిందిఈ సమావేశానికి ము ఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి వి కృష్ణ హా జరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి 8 సంవత్సరా లుగా దేశాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేసిందనిని త్యా వసర వస్తువుల ధరలో బియ్యం పాలు నూనెలు అప్పు దినుసులు తో సహా అన్ని రకాల వస్తువులు పై న జీఎస్టీ పేరుతో భారం మోపారన్నారు ఆదాని అం బానీలకు పోర్టులు విమానాశ్రయాలు టెలికం విద్యుత్ ఎలా ఒక్కొక్కటి దారం చేస్తున్నారు ఆదాయాలు మా త్రం పెరగటం లేదుకార్మికులకు ఉద్యోగ భద్రత లేదు లే బరు కోడులను తెచ్చి ఉన్న హక్కులను హరింప చేశారురైతుల చట్టాల పేరుతో బడ కంపెనీలకు వ్యవసా య రంగాన్ని కట్టబెట్టే ప్రయత్నాలు బిజెపి ప్రభుత్వం చేస్తుందిరాష్ట్రాల హక్కులను హరించి ఫెడరలిజాన్ని నాశనం చేస్తుందని ఆయన అన్నారుశాసనస భ్యుల ను కొనుగోలు చేసి సిబిఐ వీడియోలు ద్వారా దుర్వి నియోగం చేసి బిజెపి యాత్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూ లుస్తున్నారు మన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుం డా విభజన హామీలు అమలు చేయకుండా బీజేపీ మోడీ బాగా చేస్తుందని ఆయన అన్నారుకేంద్ర ప్రభు త్వం విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 24న విజయ వాడ, జింఖానా గ్రౌడ్ లో భారీ బహిరంగ సభ జరుగు తుందని ఈ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతా రాం ఏచూరి హాజరవుతున్నారుఈ సభకు ప్రజలు వే లాదిగా కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్,మండల కార్యదర్శి చాట్ల రవి పార్టీ స భ్యులు సానుభూతిపరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజు వార్డులను శుభ్రం చేయాలి: కమిషనర్ జయరాం



నందిగామ సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి పట్టణ పరిధిలో 09వ వార్డు నందు గురువారం మున్సిపల్ కమిషనర్ . జయరాం పర్యటించారు. ప్రతి రోజు వా ర్డులోని అన్ని వీధులను బ్రషింగ్ చేయించవలేనని సూచించారు. ముక్కపాటి నగర్ శివారు ఖాళీ స్థలాలో ఉన్నటువంటి పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించవలేనని, అట్లు చేయని స్థల యజమానుల కు నోటీసులు జారీ చేయవలెనని తెలిపారు. వార్డులో ప్రజలు మంచినీటి సమస్యలను తెలుపగా రెండు రో జులలో పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదే శించారు. ఇంటింటికి మంచినీరు అందించే మంచినీటి పైప్ లైన్ వర్క్ లను వారం రోజులలోగా పూర్తి చేయ వలెనని సూచించారు. ఈ కార్యక్రమములో వైసిపి నా యకులు దేవేందర్ రెడ్డి, కృపారావు మరియు సచి వా లయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు భవనానికి అంబేద్కర్ పేరు పెట్టండి: కేంద్ర మంత్రి ని కోరిన విదసం..



విశాఖపట్నం, ప్రజాపాలన ప్రతినిధి: భారత ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించిన సెంట్రల్ విస్తా లో పార్లమెంటు భవనానికి అంబేద్కర్ భవన్ గా నామకరణం చేయాలని విశాఖ జిల్లా దళిత సంఘాల ఐక్యవేదిక (వి ద సం ఐక్యవేదిక కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆంధ్ర ప్రదేశ్ పర్యటన కు విజయవాడ వచ్చిన కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి అబ్బయ్య నారాయణ స్వామిని వి ద సం ఐక్యవేదిక హెూటల్ గేట్ వే లో కలిసి సమస్య లను మంత్రి దృష్టికి తెచ్చారు. కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు, మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెంట్రల్ విష్ట భారతావనికి తలమానికం అన్నారు. పార్లమెంటు భవనం మరింత ఉన్నత మైనది, రాజ్యాంగానికి నిలువెత్తు నిదర్శనం అని ఈ భవనానికి అంబేద్కర్ నామకరణం చేయాలని కోరారు. మంత్రి నారాయణ స్వామి స్పందిస్తూ అంబేద్కర్ పేరు పై ప్రధాని తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి ద సం ఐక్యవేదిక సహాయ కన్వీనర్లు ఈతలపాక సుజాత, కోలా హరి బాబు, వడ్లమూరి ఫ్రాన్సిస్, పెరియార్ అంబేద్కర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎలిసల శ్రీనివాస రావు పాల్గొన్నారు..

## ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను చేధించిన జిల్లా పోలీస్ అధికారులు వాటి విలువ సుమారు రూ.3,00,000/-



బాపట్ల జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: తేది: సెప్టెంబర్. 15.ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను చేధించిన చీరాల రూరల్ సుబ్రమణ్యం శివనాగేశ్వర రావు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించినారని ఇచ్చిన పిర్యాదు మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.జనార్ధన్ దర్యాప్తు ప్రారంభించారు. బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ,ఆదేశాల మేరకు చీరాల పి. శ్రీకాంత్, చీరాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. మల్లిఖార్జున రావు , పర్యవేక్షణలో చీరాల రూరల్.ఎస్.ఐ,పి.జనార్ధన్.దర్యాప్తు ప్రారంభించగా, ఎస్ఐ గారికి రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలసి ఈపురుపాలెం గ్రామంలోని శేఖర్ పుట్ట దగ్గరలో ఒక బాలుడి కదలికలు అనుమానంగా ఉండడంతో ఉదయం 08.00 గంటల సమయంలో ఆ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా అతడి తల్లి, దండ్రులు కుటుంబ కలహాల కారణంగా విడిపోయి వేరుగా ఉంటున్నారని, అతడి తల్లి సంరక్షణలో ఒంగోలులో ఉంటూ 6 వ తరగతి వరకు చదువుకొని, ఆ తరువాత చదువు మానేసి చెడు అలవాట్లకు బానిసగా మారి, సిగిరెట్లు, మందు తాగడానికి డబ్బులు అవసరం అయ్యి, చీరాల చుట్టుప్రక్కల పలు ప్రదేశాలలో మోటార్ సైకిల్లను దొంగతనం చేసి వాటిని అమ్మి వచ్చిన డబ్బులతో జల్సా చేస్తూ జీవిస్తున్నట్లు తెలిపినాడు. చట్టంతో సంఘర్షణ పడుతున్నబాలుడు చీరాల రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 4 ద్విచక్ర వాహనాలను మరియు బాపట్ల టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించగా అంతట అతడి వద్ద నుండి మొత్తం 6 ద్విచక్ర వాహనాలను చీరాల రూరల్ పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చెయ్యబడిన చోరీ సొత్తు మొత్తం విలువ సుమారు:- %=ం.3,00,000/-%కేసు ఛేదనలో చేజించడంలో ఉ త్తమ ప్రతిభ కనబరిచిన చీరాల రూరల్ పోలీసులు.

# మాకు న్యాయం చేయాలి





భీమిలీ ప్రజాపాలన ప్రతినిధి: జీవీఎంసీ పరిధి రెండో వార్డ్ లో 2002 సంవత్సరంలో వుడా నిధులతో ఎన్టీఆర్ కళ్యాణ మండపం నిర్మించడం జరిగింది. దానిని కూల్చివేసి కళ్యాణ మండపం స్తానే రైతు బజార్ నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రారంభించడం . వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారికి రైతు బజార్ నిర్మాణం నిమిత్తం జీవీఎంసీ వారు అప్పగించడం . కానీ ఈ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ వారికి నిర్దేశించిన స్థలం కన్నా ఎక్కువ స్థలాన్ని త్రవ్వకాలు మొదలుపెట్టగా అక్కడ ఉన్నటువంటివి గతంలో నిర్మించిన రిటైనింగ్ వాలు అలాగే రిటైనింగ్ వాల్ తర్వాత నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన సి సి రోడ్డు కూలిపోయి నిర్వాసితులు ఇళ్ళలోకి వెళ్లలేని విధంగా మారింది ప్రస్తుతానికి వర్షాలు ఆగడం వల్ల ఆస్తి నష్టం మాత్రమే . అదృష్టవ శాత్తు ప్రాణ నష్టం లేదు కానీ వర్షాలు గత వారంలో కురిసిన విధంగానే కురిసినట్లయితే ఇంకా పైనున్నటువంటి ఇల్లు కూడా జారి ప్రాణనాష్టం కూడా జరిగే అవకాశం ఉంది రక్షణ గోడకి కింద భాగంలో త్రవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు వాపోతున్నారు రక్షణ గోడకి ఎంత దూరాన్ని విడిచిపెట్టి మిగతా ప్రాంతంలో నిర్మాణం చేయాలి అనేది అధికారులు నిర్దిష్టంగా సూచించలేదా లేక కాంట్రాక్టర్ అత్యుత్సాహమా తెలియాల్సి ఉంది కాగా నేడు జీవీఎంసీ అధికారులు రక్షణ కూడా నిర్మించడానికి అంచనాలు వేసి పై అధికారులకు పంపడం నిజానికి ఈ నష్టాన్ని ఎవరు పూర్తి చేయాలి ఎవరు భర్తీ చేయాలి దీనికి బాధ్యులను ఎందుకు విడిచిపెడుతున్నారు కచ్చితంగా ఈ పరిస్థితులకు బాధ్యులైన వారితోనే నష్టపరిహారాన్ని కట్టించాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. ఈ తెలుగుదేశం భీమునిపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు , పిట్ట సురేష్ , డి ఏ ఎన్ రాజు, గంట నూకరాజు , బడిగంటి నీలకంఠం తమ్మిన సూరిబాబు, చేట్ల రమణ, వానపల్లి సత్య, చిలక నర్సింగ్ రావు, నర్వ రామారావు, జోగ సన్యాసిరావు, చోటుపల్లి సాయి, నరగడ అప్పారావు కసిరెడ్డి దామోదర్, పాసి నర్సింగ్ రావు, గరికిన కింగ్ గిడుతూరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు

## ముచ్చటగా మూడో సా(రీ)రి ముంచిన గోదారమ్మ



తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ,గోదావరి వరద మూడోసారి మరలా పెరిగి పోయింది పల్లపుప్రాంతముల పంట పొలములు నీటమునిగాయి, మరియూ ఇసుక బోట్స్ మెన్ సొసైటీ వారు నిండా మునిగిపోయారు గతంలో పెట్టిన పెట్టుబడులు రాకపోగా మళ్ళీ గోదారమ్మ వచ్చి ముంచింది, ఏమి చెయ్యాలో తోచని స్థితి లో వున్నారు

## వినాయకుని గుడి వద్ద భారీ అన్న సంతర్పణ



గోకవరం సెప్టెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి: గోకవరం గ్రామంలోని మెయిన్ రోడ్డుపై గల అతి పురాతనమైన వినాయకుని గుడి వద్ద గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోకవరంలోనే పురాతనమైన,ప్రాధాన్యత గల వినాయకుని గుడి కావడంతో ఈ గుడి వద్దకు అన్నదానానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సుమారు వెయ్యి మంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు సుమారు10 రకాల కూరలు,స్వీట్లు, పులిహార తదితర వంటకాలతో భక్తులకు వడ్డించడం జరిగినది. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులు సంతృప్తిగా భోజనాలు చేసి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పిరట్ల చిన్న వెంకన్న, జయవరపు సత్తిబాబు, తుమ్మల చిన్నబ్బు, తుమ్మల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, వైసిపి ఇంచార్జ్ ల చొరవతో ఎత్తిపోతల పంపింగ్ స్కీమ్‌కు నీటి విడుదల



చీరాల, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : తోట వారి పాలెం ఎత్తిపోతల పంపింగ్ స్కీంకు నీటిని విడుదల చేయటం పట్ల, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు బోయిన కేశవులు, ఏపీ అర్బన్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు లు హర్షం వ్యక్తం చేశారు. చీరాల మండలం, తోటవారిపాలెం ఎత్తిపోతల పంపింగ్ స్కీమ్ కు, ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కావూరి రమణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు బోయిన కేశవులు, ఏపీ అర్బన్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మేడిబోయిన రత్నారెడ్డి తదితరులు మాట్లాడుతూ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్, వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ లు, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అధికారులతో సమీక్షించారన్నారు. ఎమ్మెల్యే వైసీపీ ఇన్చార్జిల చొరవ తోనే, త్వరితగతిన తోటవారిపాలెం ఎత్తిపోతల పంపింగ్ స్కీమ్కు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. చీరాల మండల రైతుల తరఫున, ఎమ్మెల్యే బలరామ్ కు, వైసిపి చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ వెంకటేష్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే, వైసిపి ఇంచార్జ్ లు సత్వరమే స్పందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పంపింగ్ స్కీమ్ అధ్యక్షులు గవిని వెంకటేశ్వర్లు, వైసిపి సీనియర్ నాయకులు మేడిబోయిన రత్నారెడ్డి, ఎత్తిపోతల పంపింగ్ స్కీమ్ పరిధిలోని రైతులు, పరిసర గ్రామ ప్రాంత నాయకులు రైతులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో వికలాంగులకు, వృద్ధులకు పెన్షన్లు పంపిణి



చీరాల, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : ప్రతీ నెలా అవోపాలో జరుగుచున్న వికలాంగులు మరియు వృద్దుల పెన్షన్ కార్యక్రమాన్ని, మారుటూరి రాఘవేంద్ర రావు అధ్యక్షతన నిర్వహించి, 205 మందికి, రు.200/- పెన్షన్, స్వెట్టర్, 2కేజీల బియ్యం, భోజనం అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తాతా సుబ్బారావు దాతలందరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భముగా, అవోపా మాజీ అధ్యక్షులు స్వర్గీయ కాకరపర్తి వెంకటేశ్వర్లు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోడూరి ఏకాంబరేశ్వర బాబు, కోశాధికారి పేర్ల వెంకట రామయ్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, పద్మజ, గుగ్గిలం విశ్వం, తదితరులు పాల్గొన్నారు.

# కౌశల్ పరీక్ష కి అందరూ దరఖాస్తు చేసుకోవాలి: బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు



చీరాల, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : భారతీయ విజ్ఞాన మండలి మరియు ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యం లో,కౌశల్ - 2022 పరీక్ష కి నోటిఫికేషన్ విడుదలైందని, బాపట్ల జిల్లా విద్యా శాఖాధికారి పి.వి.జె రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, ఆయన కౌశల్ 2022 పోస్టర్ల ని ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ,కౌశల్ సైన్స్ క్విజ్ పోటీ 8,9,10 తరగతుల విద్యార్థులతో క్విజ్ టీమ్ ఏర్పడాలని, ఇది కేవలం ప్రభుత్వరంగ పాఠశాలల విద్యార్థులకు మాత్రమేనని, కనుక జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఈ పరీక్ష రాసే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిలబస్ గా,8,9,10 తరగతుల గణితము, సైన్స్ మరియు "విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి" మెటీరియల్ ని నిర్ణయించారన్నారు. బహుమతులు ప్రశంసా పత్రం, జ్ఞాపిక మరియు నగదు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధమ బహుమతి గా రూ.7,500 లు, ద్వితీయ బహుమతిగా రూ.6వేలు, తృతీయ బహుమతి గా రూ.4,500 లు ఇస్తారన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి లో, ప్రధమ బహుమతి రూ. 15వేలు,ద్వితీయ బహుమతి రూ. 12వేలు, తృతీయ బహుమతి రూ. 9వేలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో కన్సలేషన్ బహుమతులు రూ. 6,000/- చొపున నగదు బహుకరించబడునన్నారు. పాఠశాల కో-ఆర్డినేటర్లు అక్టోబర్ 15వ తేది లోపు విద్యార్థుల పేర్లను డబ్ల్యూ.డబ్ల్యూ. డబ్ల్యూ. బీవీఎంఏపి డాట్ ఓఆర్జీ లో నమోదు చేసుకోవచ్చున న్నారు. పోస్టర్ కాంపిటీషన్‌లో, జనరల్ థీమ్ మరియు స్వాతంత్ర్య అమృత మహోత్సవాల థీమ్ 8 మరియు 9తరగతుల నుండి ఇద్దరు (రెండు ప్రెజంటేషన్లు)ఒక పాఠశాల నుండి అనుమతించబడునన్నారు. సర్టిఫికేట్, జ్ఞాపిక మరియు నగదుబహుమతులు అందిస్తామన్నారు. రిజిస్ట్రేషన్‌కి చివరి తేది 15 అక్టోబర్ 2022 గా నిర్ణయించారన్నారు. ప్రాథమిక స్థాయి ఆన్లైన్ పరీక్ష 2,3 నవంబర్ 2,3 తేదీలలో పాఠశాలలో, జిల్లా స్థాయి పోటీలు నవంబర్ 26న, రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 9న జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ద్వారా అందజేయ బడునన్నారు. పూర్తి వివరాలకు వెబ్సైట్ లేదా 8121445688 నంబర్ లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాడు - నేడు జిల్లా నోడల్ ఆఫీసర్ పుల్లెల సుబ్రహ్మణ్యే శ్వర రావు, కౌశల్ జిల్లా సమన్వయ కర్త పవని భాను చంద్ర పాల్గొన్నారు.

# నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

**పోలీసుల తీరును ఖండించిన ఎమ్మెల్యే ఏలూరి**

**అర్ధరాత్రి ఇండ్లపై వెళ్లి దాడులు సరికాదు**

**నియోజకవర్గ వ్యాప్తంగా భయానక వాతావరణం సృష్టించిన పోలీసులు**

**ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని ప్రభుత్వం**

**ఎమ్మెల్యే వీరాంజనేయ స్వామి పై మంత్రి వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే ఏలూరి**



పర్చూరు, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ఇచ్చిన మాటకు కట్టుబడి నిరుద్యోగ యువతకు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిరుద్యోగ యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చాయన్నారు. పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. నోటీసులు ఇచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి ఇళ్లలోకి వచ్చి భయానక వాతావరణ సృష్టించి అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వం పోలీసులు అడ్డం పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడడం అవివేకం అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, జాబ్ క్యాలెండర్ లేదని, ఉద్యోగాల భర్తీ లేదని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 7 డీఎస్సీలు వేశామని, చంద్రబాబు హయాంలో, నిరుద్యోగ భృతి ఇచ్చామని ఆయన గుర్తుచేశారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకపోవడం వల్ల, ప్రైవేట్ రంగంలోనూ యువతకు నిరాశే ఎదురైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను, అమలు చేయాలని డిమాం డ్ చేశారు. అసెంబ్లీ వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులకు మద్దతుగా, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి పై, మంత్రి మేరుగ నాగార్జున చేసిన వ్యాఖ్యలను,ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక సహచర ఎమ్మెల్యేపై మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, అసభ్యకరంగా మాట్లాడడం తగదన్నారు. ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

-- నియోజకవర్గ వ్యాప్తంగా అరెస్టులు

చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో,పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో, ఆయా నేతల నివాసాలకు వెళ్లి నోటీసులు అందించారు. మళ్లీ రెండు గంటల సమయంలో, వీళ్లకు వెళ్లి స్టేషన్కు తరలించిన సంఘటనలు నెలకొన్నాయి. అనేక సంఘటనలో నేరస్తులను తీసుకెళ్లినట్లు, పోలీసులు తీసుకెళ్లడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పలువురు నేతలకు ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. ఉదయం స్టేషన్‌కి వెళ్ళిన నాయకులను, సాయం త్రం వరకు బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. పోలీసుల అత్యుత్సాహంతో నాయకులలో ఆగ్రహఆవేశాలు వ్యక్తమయ్యాయి.

-- పోలీసుల తీరుకు నిరసన.

నియోజకవర్గవ్యాప్తంగా పోలీసులు వ్యవహరించిన తీరుపట్ల, తెలుగుయువత టీఎన్ఎస్ఎఫ్ తెలుగుదేశం పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. మార్టూరులో తెలుగు యువత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫారుక్ దేవతోటి నాగరాజు, మార్టూరు మండల అధ్యక్షులు తాటి నాగేశ్వర రావు మాట్లాడారు. పోలీసులు నిర్బంధాలతో అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తుందన్నారు. ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## ఘనంగా సెయింట్ ఆన్స్ కాలేజీ లో ఇంజినీర్స్ డే వేడుకలు



చీరాల, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ఐ.ఎస్.టి.ఇ. చాప్టర్ ఆధ్వర్య ములో, " ఇంజినీర్స్ డే", సందర్భముగా భారత రత్న సర్. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన వేడుకలను కళాశాల ప్రధానోధ్యాపకులు డాక్టర్ మొయిద వేణు గోపాల రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజినీర్ గా,భారతదేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భముగా వివిధ విభాగాలలో, నిర్వహించిన పోటీలలో, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానము చేశారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి, పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఐ. ఎస్. టి. ఇ. చాప్టర్ సెక్రటరి ప్రొఫెసర్ పి.వి.యస్ శర్మ ఆధ్వర్వంలో జరిగిన, ఈ కార్యక్రమంలో, అక్రిడిషన్స్ డైరెక్టర్ డాక్టర్. సి. సుబ్బారావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రొటెక్ట్ సంస్థ వ్యాసరచన పోటీలకు విశేష స్పందన




వేటపాలెం, సెప్టెంబర్ 15, ప్రజాపాలన : చీరాల ప్రొటెక్ట్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఒంగో లు ప్రాంతీయ కార్యాలయం సౌజన్యంతో, ఓజోన్ డే ని పురస్కరించుకుని, నిర్వహించిన వ్యాసరచన పోటీలకు, విద్యార్థుల నుండి విశేష స్పం దన లభించింది. వేటపాలెం మండలం, దేశాయిపేట పంచాయితీ పరిధిలోని, జిల్లా పరిషత్ హై స్కూలులో, ఇంచార్జ్ హెచ్ఎం కుసుమ కుమారి అధ్యక్షతన వ్యాసరచన పోటీలు జరిగాయి. ఓజోన్ పొర ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలకు, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను, ఒంగోలులోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో అందజేస్తారని, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం పి. కుసుమ కుమారి, గోపాల కృష్ణమూర్తి, ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి శవనం.చంద్రారెడ్డి, కోఆర్డినేటర్ ఎం. శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ధర్నాను జయప్రదం చేయండి: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి




మచిలీపట్నం టౌన్ :15 సెప్టెంబర్ ప్రజాపాలన: మచిలీపట్నం గురువారం భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 20వ తారీకున జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె.వి. గోపాల్ రావు గారు పిలుపునిచ్చారు రాజుపేట సెంటర్లో న్యూ తాపీ పని వారి కూలిల సంఘం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక సంక్షేమ బోర్డు ఖజానా నుండి 18 వేల కోట్ల రూపాయలు నిర్మాణ కార్మికుల సంక్షేమ సొమ్మును వాడుకున్నారని అన్నారు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బోర్డు డబ్బులు వాడుకోవడం దుర్మార్గం అన్నారు తక్షణమే ఆ డబ్బులు బోర్డుకి జమ చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది కార్మికులు వాళ్ళ కుటుంబాలు కరోనా టైంలో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకున్న పరిస్థితి ఈ ప్రభుత్వానికి లేదన్నారు సిఐటియు నాయకులు సిహెచ్ జయ రావు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని ఆరోజున భవన నిర్మాణ కార్మికులకు సిఐటి నాయకులకు హామీ ఇచ్చిన ధర్మేల రాష్ట్రవ్యాప్తంగా 2009లో సంక్షేమ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయటం జరిగింది ఆ రోజు నుండి అరకురా కార్మికులకు సంక్షేమ ఫలాలు క్లెయిమ్స్ రూపంలో ఇస్తూ వచ్చిన ఈ ప్రభుత్వం వచ్చినాక పూర్తిగా వాటిని రద్దు చేసే పరిస్థితుల్లో ఈ మూడున్నర కాల సంవత్సరాల లో కార్మికులకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపం లేదు కరోనా టైంలో పదివేల రూపాయలు ఆర్థిక సహాయం కార్మికులకి ఇవ్వమని సిఐటి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీసుల వద్ద ధర్నాలు చేసి వినతిపత్రం ఇవ్వటం జరిగింది కానీ ప్రభుత్వం నిమ్మకి నీరు ఎత్తినట్టుగా వ్యవహరించింది.

జగన్మోహన్ రెడ్డి గారికి వాళ్ల నాన్నగారు ఇచ్చిన సంక్షేమ ఫలాన్ని కూడా లాగేసుకొనేటట్టుగా వ్యవహరిస్తున్నాడని ఇది చాలా దుర్మార్గం అని అన్నారు ఈ రోజున కొత్తగా భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు పెళ్లిళ్లు అయితే 40 వేల రూపాయలు ఇస్తానని ప్రకటన చేశారు కానీ పని చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత దెబ్బలు తగిలిన చనిపోయిన అలాగే పని చేసే కార్మికుల పిల్లలకు కాన్పులైన అనారోగ్యం పాలైన కార్మిక ల ఈ డబ్బులు గురించి ఏమీ మాట్లాడకుండా ఈరోజు కొత్తగా ఈయన పథకం పెట్టినట్టుగా ప్రకటన చేస్తున్నారు ఇది సరైనది కాదని అన్నారు సంక్షేమ బోర్డులో కార్మికులకు వర్తింపజేసే పథకాలన్నీ వర్తింపచేయాలని లేనిపక్షంలో కార్మికులు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా సమీకరించి ప్రభుత్వం విధానాలను వెంటకడతామని చెప్పారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు సంఘం నాయకులు వి వెంకట్రావు పిస్వామి కిషోర్ సుభాని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మెగాస్టార్ యంగ్ డైరెక్టర్ కు షాకిచ్చినట్టేనా?



టాలీవుడ్ లో ప్రతీ హీరో వరుస ప్రాజెక్ట్ లలో నటిస్తూ క్షణం తీరిక లేకుండా గడిపేస్తున్న విషయం తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి కూడా బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్ట్ లలో నటిస్తూ అందరిలానే తను కూడా ఫుల్ బిజీగా వున్నారు.గతంతో పోలిస్తే బ్యాక్ టు బ్యాక్ యంగ్ డైరెక్టర్లకు చిరు అవకాశాలు ఇస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం చిరంజీవి మూడు సినిమాలు చేస్తున్నారు. అందులో రెండు రీమేక్ సినిమాలు. మలయాళ హిట్ ఫిల్మ్ ఆధారంగా తెలుగులో 'గాడ్ ఫాదర్'ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే.ఈ మూవీకి మోహన్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మెగాస్టార్ తొలిసారి సాల్ట్ అండ్ పెప్పర్ లుక్ లో.. హీరోయిన్ లేకుండా నటిస్తున్న మూవీ ఇది. సల్మాన్ ఖాన్ కీలక అతిథి పాత్రలో నటిస్తుంటే నయనతార సత్యదేవ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని దసరాకు రిలీజ్ చేస్తున్నారు. ఇక ఈ మూవీతో పాటు బాబీ డైరెక్షన్ లో 'వాల్తేరు వీరయ్య' మూవీ చేస్తున్నారు. మరొకటి తమిళ రీమేక్ 'భోళా శంకర్'.దీనికి మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తుండగా కీర్తి సురేష్ కీలక పాత్రలో చిరుకు సిస్టర్ గా కనిపించబోతోంది. ఇక ఈ మూవీస్ తో పాటు మరో యంగ్ డైరెక్టర్ వెంకీ కుడములతో మరో ప్రాజెక్ట్ కు మెగాస్టార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. రీసెంట్ గా స్టార్ 'ఆర్ఆర్ఆర్' వంటి పాన్ ఇండియా మూవీని నిర్మించిన స్టార్ ప్రొడ్యూసర్ డీవీవీ దానయ్య ఈ మూవీని నిర్మించబోతున్నానంటూ గతంలోనే ప్రకటించారు.ఈ విషయాన్ని మీడియాకు ప్రత్యేకంగా వెల్లడించారు. అయితే ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి గత కొన్ని నెలలుగా ఎలాంటి ముందడుగు పడటం లేదు. చిరు వరుస ప్రాజెక్ట్ లలో బిజీగా వుండటం అదే సమయంలో మారుతితో సినిమా చేయడానికి చిరు ఆసక్తిని చూపించడం.. వెంకీ కుడుముల ప్రాజెక్ట్ చేయడానికి ఆసక్తి చూపించకపోవడంతో ఈ ప్రాజెక్ట్ ఇక లేనట్టే అనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకండా వెంకీ కుడుములతో సినిమా చేయడానికి చిరు ఇంట్రెస్ట్ గా లేరని తెలుస్తోంది. దీంతో దర్శకుడు వెంకీ కుడుముల యంగ్ హీరోల వెంట పడుతున్నారట. 'భీష్మ'తో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న వెంకీ కుడుముల రెండేళ్ల పాటు చిరు కోసం ఎదురుచూసి విలువైన సమయాన్ని వృధా చేసుకున్నారని ఇప్పటికైనా యంగ్ హీరోలతో వెళితే మంచిదని పలువురు సూచిస్తున్నారట. దీంతో చిరు తో ప్రాజెక్ట్ పట్టాలెక్కడం కష్టమని భావించిన వెంకీ కుడుముల ప్రస్తుతం యంగ్ హీరోస్ ని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాడట.

## హృతిక్ "విక్రమ్ వేద"కి ఓవర్సీస్ లో రికార్డు స్థాయి రిలీజ్.!




బాలీవుడ్ సినిమా నుంచి ఎన్నో అంచనాలు పెట్టుకొని రిలీజ్ కి వస్తున్న మరో మోస్ట్ అవైటెడ్ భారీ సినిమా "విక్రమ్ వేద" కోసం అందరికీ తెలిసిందే. బాలీవుడ్ స్టార్ నటులు హృతిక్ రోషన్ మరియు సైఫ్ అలీఖాన్ లు హీరోలుగా గాయత్రీ పుష్కర్ ల దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ చిత్రం ఈ ఏడాది గ్రాండ్ రిలీజ్ కి రెడీగా ఉంది. అయితే ఈ సినిమాతో మళ్ళీ బాలీవుడ్ లో పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని ఆశిస్తున్నారు.ఇక ఇదిలా ఉండగా ఈ భారీ సినిమా అయితే ఓవర్సీస్ లో నెక్స్ట్ లెవెల్ రిలీజ్ కి రెడీ అవుతుందట. మన దేశంలోనే ఈ సినిమా రికార్డు మొత్తం స్క్రీన్స్ తో రిలీజ్ అవుతుండగా ఓవర్సీస్ లో అయితే ఏకంగా 100కి పైగా దేశాల్లో ఈ చిత్రం రిలీజ్ అవుతుందట. దీనితో ఈ అంశం బాలీవుడ్ వర్గాల్లో సెన్సేషన్ గా మారింది. మరి ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ కోసం అయితే చాలా మందే ఎదురు చూస్తున్నారు మరి ఈ సినిమా అయితే ఎలా పెర్ఫామ్ చేస్తుందో చూడాలి.

## అఖిల్ ని కరణ్ చేతిలో పెడుతున్న నాగ్?



బాలీవుడ్ కింగ్ పిన్.. దర్శకనిర్మాత కరణ్ జోహార్ ని ఎవరు కలిసినా ఊహాగానాలు వేరే లెవల్ కి చేరుకుంటాయి. అతడు వరుసగా డెబ్యూ తారల్ని బాలీవుడ్ కి పరిచయం చేసిన వాడిగా అసాధారణ రికార్డును కలిగి ఉన్నాడు. దాంతో పాటే ఇండస్ట్రీలో భారీ పాన్ ఇండియా సినిమాలను నిర్మిస్తూ.. ఇటు సౌత్ సినిమాలను ఉత్తరాదిన ప్రోత్సహిస్తూ ఇక్కడి యువహీరోలను బాలీవుడ్ కి ప్రమోట్ చేస్తూ బోలెడంత ఎన్ క్యాష్ చేస్తున్న ట్యాలెంటెడ్ పర్సనాలిటీగాను గుర్తింపును పొందాడు. ఇక నటవారసులను పెద్ద స్టార్లను చేయాలంటే కరణ్ ఒక చెయ్యేస్తే చాలు అనుకుంటున్నారు సౌత్ లో.అయితే ఇలాంటి సమయం లో కింగ్ నాగార్జున తనయుడు అఖిల్ తో కలిసి ముంబై విమానా శ్రయంలో కనిపించడం.. అటుపై నాగ్ ఏకంగా ధర్మా ప్రొడక్షన్స్ ఆఫీస్ లో ప్రత్యక్షమవ్వడంతో రకరకాల సందేహాలు అలుముకున్నాయి. ఈరోజు నాగార్జున ధర్మ ప్రొడక్షన్స్ కార్యాలయంలో కనిపించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. దీంతో ఇప్పుడే నాగ్ ముంబైలో ఎందుకు దిగారనే దానిపై అభిమానుల్లో విస్తృతంగా చర్చ మొదలైంది. కరణ్ నిర్మించిన బ్రహ్మాస్త్రలో నాగ్ నటించాడు. నాగ్ పాత్ర మొదటి భాగంలో ముగిసింది. కానీ ఇంకా అతను ముంబైలో కనిపించడం కొత్త ఊహాగానాలకు దారితీసింది. ఒకవేళ బ్రహ్మాస్త్ర సెకండ్ పార్ట్ లో భాగం కాబోతున్నాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. 'బ్రహ్మాస్త్ర'లో కింగ్ నాగార్జున ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు. తన పాత్రకు వచ్చిన రెస్పాన్స్ తో చాలా సంతోషంగా ఉన్నాడు. ఇకపోతే బ్రహ్మాస్త్ర 2లో ఏదైనా కొత్త పాత్రకు ఆస్కారం ఉందా? అది నాగ్ కి కాకుండా అఖిల్ కి కనెక్ట్ కాబోతోందా? అనే సందేహాలను అక్కినేని ఫ్యాన్స్ సోషల్ మీడియాల్లో వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి అఖిల్ విషయంలో ఏదో కొత్తగా జరగబోతోందన్న అనుమానాలు రేకెత్తాయి.మరోవైపు కొంతకాలంగా చర్చల దశలో ఉన్న తన 100వ సినిమా గురించి నాగ్ కొత్త ప్లాన్ తో ఉన్నారా? అది పాన్ ఇండియన్ మూవీ కాబోతోందా? అన్నది ఇప్పుడు డిబేట్ గా మారింది. ఇటీవల మీడియా ఇంటరాక్షన్ సందర్భంగా నాగార్జున దీనిపైనా స్పందించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం నలుగురు దర్శకుల తో చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను ప్రకటిస్తానని చెప్పారు. తన 100వ సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నానని సరైన సమయంలో ప్రాజెక్ట్ వివరాలను ప్రకటిస్తారని అన్నారు.ఈ ప్రాజెక్ట్ కోసం మోహన్ రాజా తో చర్చలు జరుపుతున్నాడని టాక్స్ వచ్చాయి. కానీ ఇప్పుడు నలుగురు దర్శకులతో చర్చలు జరుపుతున్నట్లు నాగ్ వెల్లడించాడు. నాగార్జున 100వ చిత్రాన్ని ఆయన సొంత బ్యానర్ అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించనుం ది. అక్టోబర్ 5న 'ది ఘోస్ట్' విడుదల కానుంది. ఈ స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్కి ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించారు. నాగ్ భారీ విజయంపై కన్నేశారు. అలాగని తన ప్రయోగాత్మక శైలిని మాత్రం విడిచిపెట్టడం లేదు.

## డైరెక్టర్ ఇంటి ముందు నిర్మాత ధర్నా!




కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ దర్శకుడు బాల మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. విక్రమ్ సూర్యలతో 'శివపుత్రుడు'('పితామగన్') సూర్య హీరోగా 'నంద' వంటి విభిన్నమైన సినిమాలతో దర్శకుడిగా తిరుగులేని గుర్తింపుని సొంతం చేసుకున్నారు. 'అర్జున్ రెడ్డి' తమిళ రీమేక్ 'ఆదిత్య వర్మ' కారణంగా వార్తల్లో నిలిచిన బాల తాజాగా మరో సారి వివాదంలో ఇరుక్కున్నారు. తను రూపొందించిన 'పితామగన్' తెలుగు తమిళ భాషల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.ఈ మూవీని వీఏ దురై నిర్మించారు. ఈ సినిమాతో విక్రమ్ కు జాతీయ పురస్కారం లభించిన విషయం తెలిసిందే. అవార్డుల్ని తెచ్చిపెట్టిన ఈ మూవీ నిర్మాతకు లాభాల్ని మాత్రం తెచ్చిపెట్టలేదట. దీంతో నిర్మాత వీఏ దురై కి మరో సినిమా చేసిపెడతానని దర్శకుడు బాల అప్పుడే మాటిచ్చారట. ఆ మాట తీసుకున్న నిర్మాత బాలకు అడ్వాన్స్ గా రూ. 10 లక్షలు ఇచ్చారట. అయితే అప్పటి నుంచి అడ్వాన్స్ తీసుకున్న దర్శకుడు బాల ఏళ్లు గడుస్తున్నా నిర్మాత వీఏ దురై కి సినిమా మాత్రం చేసిపెట్టలేదట.అంతే కాకుండా తీసుకున్న అడ్వాన్స్ రూ. 10 లక్షలు నిర్మాతకు తిరిగి చెల్లించకపోగా అతనికి బాల సమాధానం కూడా చెప్పడం లేదని ఇలా ఏళ్లు గడిచిపోతున్నా తనకు సినిమా చేయడం లేదు. పోనీ ఇచ్చిన అడ్వాన్స్ కూడా తిరిగి ఇవ్వడం లేదని ఆగ్రహించిన నిర్మాత మంగళవారం చెన్నైలోని బాల కార్యాలయానికి వచ్చి తను ఇచ్చిన అడ్వాన్స్ రూ. 10 లక్షలు తిరిగి చెల్లించాల్సిందిగా నిలదీశాడట. దీంతో బాల అనుచరుడు నిర్మాత వీఏ దురైని కార్యాలయం నుంచి బయటికి నెట్టేశాడట.విషయం సీరియస్ కావడంతో ఆగ్రహించిన నిర్మాత వీఏ దురై బాలా కార్యాలయం ముందు ధర్నాకు దిగడం ఇప్పుడు కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే విషయం తెలుసుకున్న నిర్మాతల మండలి సభ్యులు వీఏ దురైకి ఫోన్ చేసి సమస్యని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారట.దీంతో నిర్మాత వీఏ దురై అక్కడి నుంచి వెళ్లిపోయినట్టుగా చెబుతున్నారు. నిర్మాతగా కష్టాల్లో వున్న వీఏ దురై ప్రస్తుతం నటుడిగా కొనసాగుతున్నాడు.

## బ్రహ్మాస్త్ర బ్రేక్ ఈవెన్ కష్టమేనా?



బాలీవుడ్ గత కొన్ని నెలలుగా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది. స్టార్ హీరోలు క్రేజీ స్టార్స్ నటించిన సినిమాలు బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ గా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాలీవుడ్ ని కాపాడేది ఎవరు? మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేది ఎవరు అనే చర్చ మొదలైంది. బిగ్ స్టార్స్ నటించిన సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద బోల్తాపడుతుండటం తో అందరి దృష్టి కరణ్ జోహార్ 'బ్రహ్మాస్త్ర'పై పడింది.రణ్ బీర్ కపూర్ అలియాభట్ జంటగా నటిస్తే.. అమితాబ్ బచ్చన్ నాగార్జున డింపుల్ కపాడియా మౌనీరాయ్ కీలక పాత్రల్లో నటించారు. అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేసిన ఈ మూవీ ఎలాగైనా బాలీవుడ్ కు మంచి రోజుల్ని తీసుకొస్తుందని అంతా ఆశగా ఎదురుచూశారు. అయితే ప్రారంభం నుంచి మూవీపై పాజిటివ్ టాక్ వున్నా టీజర్ ట్రైలర్ లతో ప్రేక్షకుల్ని 'బ్రహ్మాస్త్ర' నిరాశపరుస్తూ వచ్చింది. ప్రధానంగా గ్రాఫిక్స్ చాలా నాసిరకంగా వున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా కామెంట్ లు వినిపించాయి.ఆ తరువాత బాయ్ కాట్ గ్యాంగ్ రంగంలోకి దిగింది. సినిమాని సోషల్ మీడియా వేదికగా బాయ్ కాట్ చేయాలంటూ పోస్ట్ లు పెడుతూ వైరల్ అయ్యేలా చేసింది. ఇన్ని అడ్డంకుల్ని అధిగమించి మొత్తానికి సెప్టెంబర్ 9న వరల్డ్ వైడ్ గా థియేటర్లలోకి వచ్చిన 'బ్రహ్మాస్త్ర' అనూహ్యంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్లని రాబట్టింది. బాయ్ కాట్ ట్రెండ్ ని పట్టించుకోని ప్రేక్షకులు భారీ స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ చేసుకోవడంతో 'బ్రహ్మాస్త్ర' ఊహించని విధంగా వరల్డ్ వైడ్ గా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. తొలి రోజు వీకెండ్ లో ఈ మూవీ సాధించిన వసూళ్లు బాలీవుడ్ కు భారీ ఊరట కలిగించాయి. డివైడ్ టాక్ వున్నా ఇప్పటి వరకు ఈ మూవీ అన్ని భాషలకు కలిసి ప్రపంచ వ్యాప్తంగా రూ. 267.29 కోట్లు వసూలు చేసినట్టుగా తెలుస్తోంది. ఇలా ప్రతికూల వాతావరణంలోనూ ఈ స్థాయిలో వసూళ్లని రాబట్టడం అంత ఆషామాషీ కాదు. అయితే వీకెండ్ వరకు జోరు చూపించిన ఈ మూవీ ఒక్కసారిగా డౌన్ ఫాల్ అవుతూ వస్తుండటం షాకిస్తోంది.

## లవ్ స్టోరీస్ స్పెషలిస్ట్ తో ఉస్తాద్ రామ్!



ప్రేమకథా చిత్రాలని అందంగా సెల్యూలాయిడ్ పై ఆవిష్కరించడంతో తమిళ దర్శకుడు గౌతమ్ మీనన్ శైలి ప్రత్యేకం. 'చెలి' నుంచి 'సాహసం శ్వాసగా సాగిపో' వరకు గౌతమ్ మీనన్ చేసిన ప్రేమకథా చిత్రాలు అతనికి లవ్ స్టోరీస్ స్పెషలిస్ట్ గా మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇలాంటి దర్శకుడిగాతో ఉస్తాద్ రామ్ సినిమా చేయబోతున్నాడు. మాస్ ఎంటర్ టైనర్ లతో హీరోగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న రామ్ ..క్లాస్ డైరెక్టర్ గా పేరున్న గౌతమ్ మీనన్ కలిసి వర్క్ చేయబోతుండటం ఆసక్తికరంగా మారింది.గౌతమ్ మీనన్ డైరెక్ట్ చేసిన లేటెస్ట్ మూవీ 'వెందు తనిధాతు కాడు'. శింబు హీరోగా నటించిన ఈ మూవీని తెలుగులో 'ది లైఫ్ ఆఫ్ ముత్తు' పేరుతో రిలీజ్ చేస్తున్నారు. తమిళంలో సెప్టెంబర్ 15న విడుదల కాగా తెలుగులో మాత్రం స్రవతీ మూవీస్ బ్యానర్ పై రవికిషోర్ 17న శనివారం విడుదలచేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించిన దర్శకుడు గౌతమ్ మీనన్ పలు ఆసక్తికర విషయాల్ని వెల్లడించారు.ఇదే సందర్భంగా హీరో రామ్ తో సినిమా చేయబోతున్నానంటూ ప్రకటించి ఆశ్చర్యపరిచారు. కొన్నేళ్ల క్రితం రామ్ హీరో తెలుగు తమిళ భాషల్లో ఓ మూవీకి గౌతమ్ మీనన్ శ్రీకారం చుట్టారు. కొన్ని రోజులు షూటింగ్ కూడా చేశారు.కానీ ఆ తరువాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఆ ప్రాజెక్ట్ అర్థాంతరంగా ఆగిపోయింది. అదే ప్రాజెక్ట్ ని తిరిగి నాని తో తిరిగి ప్రారంభించి పూర్తి చేశారు. అయితే అప్పటి నుంచి రామ్ తో టచ్ లోనే వున్నానని వెల్లడించిన గౌతమ్ మీనన్ తనదో వచ్చే ఏడాది ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళుతుందన్నారు.ఈ ప్రాజెక్ట్ ని స్రవంతీ మూవీస్ బ్యానర్ పై స్రవంతి రవికిషోర్ నిర్మిస్తారట. రీసెంట్ గా రామ్ తమిళ దర్శకుడు ఎన్. లింగుస్వామి దర్శకత్వంలో 'ది వారియర్' మూవీ చేసిన విషయం తెలిసిందే. తెలుగుతో పాటు ఈ మూవీ తమిళంలోనూ విడుదలైంది. తమిళ వెర్షన్ కు రామ్ డబ్బింగ్ చెప్పుకున్నారు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని
చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను
మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com